www.epaper.asthram.com

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

శనివారం 24 జనవరి 2026

సంగారెడ్డి సంచిక : 190 సంపుటి : 1 పేజీలు : 8 వెల : రూ. 5/-

## అనంత్ అంబానీ పేరుతో రూ. 14 కోట్ల స్పెషల్ వాచ్

ప్రముఖ లగ్జరీ వాచ్‌ల తయారీ సంస్థ జాకబ్ అండ్ కో సరికొత్త వాచ్‌ను విడుదల చేసింది. దీని ఖరీదు సుమారు 1.5 మిలియన్ డాలర్లు, అంటే మన కరెన్సీలో ఏకంగా రూ.13.7 కోట్లు ఉంటుంది. ఒపెరా వంతారా గ్రీన్ కామో పేరుతో తెచ్చిన ఈ వాచ్‌కు ఓ ప్రత్యేకత ఉంది. ఈ వాచ్‌ను రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ, నీతా అంబానీల చిన్న కుమారుడు అనంత్ అంబానీ గుజరాత్‌లో నిర్వహిస్తున్న వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం వంతారాకు అంకితమిస్తూ రూపొందించారు. దీని ధర కోట్లలో ఉన్నప్పటికీ, వన్యప్రాణుల సంరక్షణకు గుర్తుగా తీసుకురావడం అంతకు మించి విలువైనదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

# మేడారం మహాజాతరకు సర్వం సిద్ధం



- ఈ రూట్లలో వెళితే మరింత సులువుగా చేరుకోవచ్చు!
- మేడారం మహా జాతరకు ఏర్పాట్లు పూర్తి
- ఆధునిక సాంకేతికతతో సర్వ సన్నద్ధం
- ఈ నెల 28వ నుంచి 31 వరకు మేడారం జాతర
- పకడ్బందీగా పోలీసు ప్రణాళిక

హైదరాబాద్

ఈ నెల 28 నుంచి మేడారం మహాజాతర జరగనున్న విషయం తెలిసిందే. యాత్రను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేస్తున్న ఏర్పాట్లు దాదాపుగా పూర్తయ్యాయి. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన మేడారం జాతర ప్రసిద్ధి పొందింది. ఈ మహా జాతరకు కోటి మంది భక్తులు తరలి వస్తారని అధికారుల అంచనా వేస్తున్నారు. దీనికి తగ్గట్లుగా ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ రాష్ట్ర పండగగా గుర్తింపు పొందిన మేడారం జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివెళ్తున్నారు. కొంతమంది నెలరోజుల ముందు నుంచే గద్దెల వద్ద మొక్కులు - మిగతా3లో



## గణతంత్ర వేడుకల్లో 'ఆపరేషన్ సిందూర్' శకటం

- ఏఐ కళ్లజోళ్లతో సెక్యూరిటీ- క్షణాల్లో నేరగాళ్లను కనిపెట్టొచ్చు!
- భద్రత దృష్ట్యా ఈ సారి గణతంత్ర వేడుకల్లో అత్యాధునిక టెక్నాలజీ వినియోగించనున్న పోలీసులు
- దీనివల్ల భౌతిక తనిఖీలు లేకుండానే, క్షణాల్లో నేరస్థులను గుర్తించి అదుపులోకి తీసుకునే అవకాశం
- గగనతల రక్షణకు ఉద్దేశించిన ఎల్-70 గన్స్, ఆకాశ్ వ్యవస్థను ఏర్పాటు చేశాం

# సొంత పార్టీ నేతల ఫోన్లనూ ట్యాప్ చేసిన ఘనత బీఆర్ఎస్‌దే

- చట్ట ప్రకారమే కేసుల దర్యాప్తు ఉంటుంది
- తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్
- గతంలో ప్రతిపక్ష నేతలవే కాదు సొంత పార్టీ నేతల ఫోన్లనూ ట్యాప్ చేశారు
- బీఆర్ఎస్ హయాంలో ఫోన్లు మాట్లాడాలంటే భయపడేవాళ్లం
- జైలుకు వెళ్లాలని బీఆర్ఎస్ నేతలకు బాగా ఉబలాటంగా ఉంది
- సింగరేణిలో అక్రమాలు ఎప్పుడు జరిగాయో తేటతెల్లం అవుతుంది



హైదరాబాద్

తాము కక్ష సాధింపు రాజకీయాలు చేస్తే బీఆర్ఎస్ నేతలు జైల్లో ఉండేవారని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. చట్ట ప్రకారమే కేసుల దర్యాప్తు ఉంటుందని తెలిపారు. గతంలో ప్రతిపక్ష నేతలవే కాదు సొంత పార్టీ నేతల ఫోన్లనూ ట్యాప్ చేశారని ఆరోపించారు. హైదరాబాద్ భూములను ప్రైవేట్ వాళ్లకు అక్రమంగా కట్టబెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఫోన్లు మాట్లాడాలంటే భయపడేవాళ్లమని వ్యాఖ్యానించారు. సింగరేణిలో అక్రమాలు ఎప్పుడు జరిగాయో తేటతెల్లం అవుతుందన్నారు. "నక్సల్స్ వంకతో తన ఫోన్ ట్యాపింగ్ చేశారని అధికారులు చెప్పారు. నటులు, వ్యాపారులు ఏమైనా తీవ్రవాదులా.. ఎందుకు ట్యాప్ చేశారు. కవిత బయటపెట్టిన వాటికి ఆధారాలు ఇవ్వాలని కోరుతున్నా. 547 మంది ఫోన్లను ట్యాప్ చేశారని అధికారులు - మిగతా3లో

# ఇరాన్‌పై కమ్ముకుంటున్న యుద్ధ మేఘాలు




- భారీగా ఆయుధాలు తరలిస్తున్న అమెరికా!
- ఇరాన్ అణు కార్యక్రమం కొనసాగిస్తే మళ్లీ దాడులు తప్పవన్న ట్రంప్
- అమెరికా హెచ్చరికలతోనే ఇరాన్ ఉరిశిక్షలు నిలిపివేసిందన్న వాదన
- మధ్యప్రాచ్యానికి తరలివస్తున్న భారీ యుద్ధ విమాన వాహక నౌకలు
- ఇరాన్ అల్లర్లలో 20 వేల మందికి పైగా మరణించినట్లు అంచనా
- శాంతి స్థాపన కోసం 'బోర్డ్ ఆఫ్ పీస్' ఏర్పాటు చేసినట్లు ప్రకటన

# కాంగ్రెస్‌లో దండుపాళ్యం ముఠా



- మేం ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదు
- పిచ్చోడి చేతిలో రాయిలా.. అసమర్థుడి జీవన యాత్రలా కాంగ్రెస్ పాలన ఉంది
- ఒక్కో రోజు ఒక్కో డ్రామాతో నెట్టుకొస్తున్నారు
- మేం ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదు
- అక్రమ, అనైతిక పనులు చేయలేదు
- అయినా నాపై తీవ్ర వ్యక్తిత్వ హననం చేస్తున్నారు.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు



## డీఎంకే పార్టీకి కౌంట్‌డౌన్ మొదలైంది

- తమిళనాడు ప్రజలు ఈ పార్టీని వేరులతో సహా పెకిలించి మార్పు కోసం ఓటు వేయాలని నిర్ణయించుకున్నారు
- డీఎంకే ప్రభుత్వం కేవలం ఒకే కుటుంబం కోసం పనిచేస్తోంది
- 2014 కంటే ముందు కేంద్రంలో కాంగ్రెస్, డీఎంకే అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన నిధుల కంటే, తమ ప్రభుత్వం తమిళనాడుకు మూడు రెట్లు ఎక్కువ నిధులు కేటాయించింది
- ఎన్డీయేకు వేసే ప్రతి ఓటు తమిళనాడును మాదకద్రవ్యాల ముప్పు నుంచి విముక్తి చేస్తుంది
- ప్రధాని మోదీ

# ఏఐ ఆవిష్కరణల అమలుకు ఐకమ్

- దావోస్ వేదికగా ఆవిష్కరించిన సీఎం రేవంత్
- ఇన్నోవేషన్ సంస్థను దావోస్‌లో ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి
- కృత్రిమ మేధను ప్రయోగాల దశ నుంచి ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యమని వెల్లడి ఏఐ ఆవిష్కరణలకు తెలంగాణను ప్రపంచ వేదికగా నిలబెడుతుంది
- తెలంగాణలో ప్రయోగాలతోపాటు ఆయా ఆవిష్కరణల అమలుకు కూడా అధిక ప్రాధాన్యమిస్తున్నాం



హైదరాబాద్

ఇప్పటి వరకు ఏఐ(కృత్రిమ మేధ) అంటే ప్రయోగాలు, స్టార్టప్ డెమోలు, పైలట్ ప్రాజెక్టులకు పరిమితమైంది. ప్రస్తుతం ప్రపంచం ఒక కీలక మలుపులో నిలిచింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను బాధ్యతాయుతంగా, విశ్వసనీయంగా ప్రజల జీవితాల్లోకి తీసుకెళ్లి ఏవిధంగా అమలు చేయాలన్నదే అసలైన సవాల్. దీనికి పరిష్కారంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకొస్తున్న భారత్‌లోనే తొలి ఎకోసిస్టమ్ ఆధారిత ఓపెన్ ఇన్నోవేషన్ సంస్థే 'ఐకమ్'. ఇది బిగ్ డేటా వినియోగం, ఏఐ నైపుణ్యాల విస్తృత అభివృద్ధి, ప్రపంచ స్థాయి స్టార్టప్‌లకు ప్రోత్సాహం, అత్యాధునిక కంప్యూటింగ్ మౌలిక వసతులతో బాధ్యతాయుత ఏఐ ఆవిష్కరణలకు తెలంగాణను ప్రపంచ వేదికగా నిలబెడుతుంది అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఐకమ్'ను రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో - మిగతా3లో

## ట్రంప్ వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధం: ఇరాన్



- తన వల్లే ఇరాన్‌లో 800 మందికి పైగా ఉరిశిక్షలు ఆగిపోయాయన్న ట్రంప్
- తాము మరణ శిక్షల నిర్ణయమే తీసుకోలేదన్న మొవాహెది
- తప్పుదారి పట్టించే ప్రచారం చేయవద్దని మీడియాకు విన్నపం

## 'మోదీ చరిత్రను వక్రీకరిస్తున్నారు



- గాంధీని మర్చిపోయేలా చేస్తున్నారు'
- నేతాజీ జయంతి వేళ కాంగ్రెస్ విమర్శలు
- ప్రధాని మోదీపై జైరాం రమేశ్ కీలక వ్యాఖ్యలు
- ఆయనో 'డిస్టోరియన్', చరిత్రను తనకు నచ్చినట్లు మార్చేస్తున్నారంటూ ఆరోపణలు

## డబ్ల్యూహెచ్‌ఓకు బకాయిపడిన అమెరికా



- ప్రపంచ ఆరోగ్య సంస్థ విషయంలో అమెరికా కీలక నిర్ణయం
- డబ్ల్యూహెచ్‌ఓ నుంచి వైదొలుగుతున్నట్లు తెలిపిన అమెరికా
- నిధులు నిలిపివేస్తున్నట్లు అమెరికా వెల్లడి
- సంస్థకు 260 మిలియన్ డాలర్లు బకాయి పడిన అమెరికా

# గణతంత్ర వేడుకల్లో 'ఆపరేషన్ సిందూర్' శకటం

దేశ రాజధాని దిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో ఈసారి శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సైనికదళాలు ఆపరేషన్ సిందూర్ శకటాన్ని ప్రదర్శించనున్నాయి. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన సైన్యం పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. భీకర వైమానికదాడులతో బెంబేలెత్తిపోయిన దాయాది దేశం కాళ్లబేరానికి వచ్చి కాల్పుల విరమణ ఒప్పందం చేసుకుంది. ఆపరేషన్ సిందూర్ భారత ఆయుధ సంపత్తితోపాటు త్రివిధ దళాల పరాక్రమాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. ఈ నేపథ్యంలో గణతంత్ర వేడుకల పరేడ్‌లో ఆపరేషన్ సిందూర్ శకటాన్ని సైనిక బలగాలు ప్రదర్శించనున్నాయి. "ఆపరేషన్ సిందూర్‌ను ఈ శకటం ద్వారా ప్రదర్శించబోతున్నాం. కేవలం 88 గంటల్లో పాకిస్థాన్‌పై ఎలా విజయం సాధించామో చెప్పబోతున్నాం. ప్రధాన టార్గెట్లను ధ్వంసం చేశాం. మొదటిరోజు రాత్రి 9 ఉగ్రస్థావరాలపై దాడులు చేసిన విషయాన్ని చూపబోతున్నాం. గగనతల రక్షణకు ఉద్దేశించిన ఎల్-70 గన్స్, ఆకాశ్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. ఆర్టిలరీ ఆయుధాలు, మొదటిరోజే ఉపయోగించిన రఫేల్ ఫైటర్లను శకటంలో ఏర్పాటు చేశాం. బ్రహ్మోస్ క్షిపణుల ద్వారా పాక్ వైమానిక స్థావరాలు, హ్యాంగర్లు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు, రన్‌వేలను ధ్వంసం చేశాం. ఎస్-400 క్షిపణీ అత్యంత దూరంలో ఉన్న పాకిస్థాన్‌కు చెందిన ఏడబ్ల్యాసీ ఎయిర్‌క్రాఫ్ట్‌ను ధ్వంసం చేసింది. 300కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఛేదించింది." అని సైనిక కమాండర్ మనీశ్ పేర్కొన్నారు.




మరోవైపు ఈ ఏడాది జరగబోయే గణతంత్ర వేడుకల కోసం పోలీసులు ఈసారి అత్యాధునిక సాంకేతికతను వినియోగించనున్నారు. దేశంలో ఉగ్ర దాడులు చేసేందుకు పాకిస్థాన్ ప్రణాళిక రచిస్తున్నట్లు నిఘా సంస్థలు హెచ్చరించిన వేళ పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. అందులో భాగంగా అత్యంత ఆధునాతన ఏఐ ఆధారిత కళ్లజోళ్లను దిల్లీ పోలీసులు తొలిసారిగా గణతంత్ర దినోత్సవాల్లో ఉపయోగించనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫేషియల్ రికగ్నిషన్, థర్మల్ ఇమేజింగ్ వంటి అత్యాధునిక టెక్నాలజీలు కలిగి ఉన్న ఈ స్మార్ట్ గ్లాసెస్ ద్వారా అనుమానితుల కదలికలపై పోలీసులు నిరంతర నిఘా పెట్టనున్నారు. ఈ కళ్లజోళ్ల ద్వారా పోలీసుల మొబైల్ ఫోన్లకు నేరగాళ్ల డేటాబేస్ అనుసంధానమై ఉంటుంది. రద్దీ ప్రాంతాల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే, వారి ముఖాలను స్కాన్ చేసి క్షణాల్లో వారి వివరాలను అందిస్తాయి.

కళ్లజోడు ధరించిన పోలీసు అధికారికి నేర చరిత్ర లేని వ్యక్తి కనిపిస్తే మొబైల్‌లో 'గ్రీన్ బాక్స్' కనిపిస్తుంది. ఒకవేళ పోలీసు రికార్డుల్లో ఉన్న నేరగాడు అయితే వెంటనే 'రెడ్ బాక్స్' కనిపిస్తూ హెచ్చరిస్తుంది. దీనివల్ల భౌతిక తనిఖీలు లేకుండానే, క్షణాల్లో నేరస్థులను గుర్తించి అదుపులోకి తీసుకునే అవకాశం ఉంటుంది. ఒక నేరగాడు 20 ఏళ్ల క్రితం ఫోటో పోలీసు రికార్డుల్లో ఉండి ఇప్పుడు తన రూపాన్ని మార్చుకున్నా ఈ కళ్లజోడు నేరస్థులను గుర్తుపడుతుందని అడిషనల్ పోలీస్ కమీషనర్ దేవేష్ కుమార్ తెలిపారు. ముఖాలను గుర్తించడమే కాకుండా ఈ కళ్లజోడుకు ఉన్న 'థర్మల్ ఇమేజింగ్' టెక్నాలజీ ద్వారా దుస్తుల లోపల దాచుకున్న ఇనుప వస్తువులు, మారణాయుధాలను కూడా ఇవి పసిగట్టగలవని చెప్పారు. కానిస్టేబుల్ స్థాయి అధికారి నుంచి ఈ కళ్లద్దాలను వాడుతారని తెలిపారు. పోలీస్ పెట్రోలింగ్ వాహనాల్లో కూడా [illegible] ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థను అమరుస్తామని వెల్లడించారు. రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు కంటికి కనిపించని ముప్పును గుర్తించడానికి ఈ కళ్లజోళ్లు బాగా ఉపయోగపడుతాయని పేర్కొన్నారు.

వర్షాన్ని లెక్కచేయకుండా కవాతు కొనసాగిస్తోన్న సైన్యం

మరోవైపు, గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దిల్లీలో పరేడ్ కోసం భారత త్రివిధ దళాలు సిద్ధమౌతున్నాయి. ఈ సందర్భంగా కర్తవ్యపథ్‌లో భారీ సన్నాహాలు జరుగుతున్నాయి. ఓ వైపు వర్షం కురుసి నేల జారుడుగా మారినప్పటికీ, సైనిక దళాలు మాత్రం కవాతును ఆపలేదు. వర్షంలో తడిసిన యూనిఫాం, బూట్లతోనే సైనిక బృందాలు సాధన చేశాయి. గుర్రాలు, ట్యాంకర్లు సహా ఆయా బృందాలు వర్షాన్ని లెక్కచేయకుండా ముందుకు సాగడం, వివిధ ఆర్మీ కంటింజెంట్లు కవాతు చేయడంతో ఆ ప్రాంతమంతా దేశభక్తి గీతాలతో మార్మోగింది.

## ఇరాన్ పై కమ్ముకుంటున్న యుద్ధ మేఘాలు...




మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయా? అంటే అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో పాల్గొన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇరాన్ లక్ష్యంగా మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ తమ అణు కార్యక్రమాన్ని పునరు ద్ధరిస్తే, అమెరికా నుంచి మరోసారి భీకర దాడులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. అణు ఆయుధాల తయారీకి ఇరాన్ ప్రయత్నిస్తే సహించేది లేదని, అవసరమైతే సైనిక చర్యకు వెనుకాడబోమని ట్రంప్ తేల్చిచెప్పారు.

### సైనిక మోహరింపుతో ఉద్రిక్తత

ట్రంప్ హెచ్చరికలకు తగ్గట్టుగానే క్షేత్రస్థాయిలో అమెరికా సైనిక కదలికలు వేగవంతమయ్యాయి. అత్యాధునిక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్‌ను అమెరికా అరేబియన్ సముద్రం/పర్షియన్ గల్ఫ్ దిశగా తరలిస్తోంది. దీనికి తోడు ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగల్ జెట్‌లు, గగనతలంలోనే ఇంధనం నింపే కేసీ-135 ఎయిర్‌క్రాఫ్ట్‌లను అమెరికా సిద్ధం చేసింది. ఇరాన్ క్షిపణి దాడులను సమర్థంగా ఎదుర్కొనేందుకు థాడ్ ([illegible]), పేట్రియాట్ వంటి శక్తివంతమైన యాంటీ మిస్సైల్ సిస్టమ్స్‌ను మధ్యప్రాచ్యంలో మోహరించారు. ఇజ్రాయెల్, ఖతార్ వంటి మిత్రదేశాల్లో కూడా రక్షణ వ్యవస్థలను అమెరికా మరింత పటిష్టం చేయడం గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతకు అద్దం పడుతోంది.

### అణు కేంద్రాలపై ఆందోళన

గత ఏడాది జూన్‌లో అమెరికా ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు జరిపిన సంగతి తెలిసిందే. ఫోర్డో అణు కేంద్రంపై జరిగిన బంకర్ బస్టర్ దాడుల తర్వాత అక్కడి నుంచి సుమారు 400 కిలోల సుసంపన్న యురేనియం అదృశ్యమైందన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత ఏడు నెలలుగా అంతర్జాతీయ అణు శక్తి సంస్థ ([illegible]) తనిఖీలు నిలిచిపోవడంతో ఇరాన్ రహస్యంగా అణు ఆయుధాలను తయారు చేస్తోందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి.

### శాంతి చర్చలకు అవకాశం ఉందా?

యుద్ధ వాతావరణం కనిపిస్తున్నప్పటికీ, ట్రంప్ 'బోర్డ్ ఆఫ్ పీస్' అనే కొత్త అంతర్జాతీయ సంస్థను ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. గాజా సమస్యతో పాటు ప్రపంచ వ్యాప్తంగా శాంతి స్థాపనకు ఈ సంస్థ కృషి చేస్తుందని ఆయన చెప్పారు. అయితే, ఇరాన్ తన ప్రాక్సీల ద్వారా హార్ముజ్ జలసంధిలో నౌకలను అడ్డుకోవడం లేదా ప్రతీకార దాడులకు దిగడం వంటివి చేస్తే పరిస్థితి చేజారిపోయే ప్రమాదం ఉంది. ఇజ్రాయెల్ కూడా తమ ఐరన్ డోమ్, అరో సిస్టమ్స్‌తో అప్రమత్తంగా ఉంది. మొత్తానికి ట్రంప్ మాటల్లో బెదిరింపులు ఉన్నప్పటికీ, చర్చలకు కూడా దారులు తెరిచే ఉంచినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

## ట్రంప్ వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధం: ఇరాన్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ ఖండించింది. తన జోక్యం వల్లే ఇరాన్‌లో 800 మందికిపైగా నిరసనకారుల ఉరిశిక్షలు ఆగిపోయాయని ట్రంప్ పేర్కొనడంపై ఇరాన్ న్యాయవ్యవస్థకు చెందిన అగ్ర ప్రాసిక్యూటర్ మొహమ్మద్ మొవాహెది తీవ్రంగా స్పందించారు. ట్రంప్ వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధాలని ఆయన స్పష్టం చేశారు. నిరసనకారులకు సామూహికంగా మరణ శిక్షలు విధించాలనే నిర్ణయమే ఇరాన్ ప్రభుత్వం ఎప్పుడూ తీసుకోలేదని మొవాహెది తెలిపారు. ఎవరికీ ఉరిశిక్షలు విధించలేదని, అరెస్టయిన వారి సంఖ్య కూడా ట్రంప్ చెప్పినంత పెద్దగా లేదన్నారు. ఈ విషయంలో తప్పుడు వార్తలు, తప్పుదారి పట్టించే ప్రకటనలు ప్రచారం చేయొద్దని అంతర్జాతీయ మీడియాను ఆయన కోరారు. ఇదే అంశంపై ట్రంప్ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్‌లో వందల మంది నిరసనకారులకు విధించబోయే ఉరిశిక్షలను అమెరికా ఒత్తిడి కారణంగా అక్కడి అధికారులు రద్దు చేశారని వ్యాఖ్యానించారు. తాను జోక్యం చేసుకోకపోయి ఉంటే 800 మందికి పైగా ప్రాణాలు కోల్పోయేవని, తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో ఇరాన్ పాలకవర్గం వెనక్కి తగ్గిందని ట్రంప్ తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వం పూర్తిగా ఖండిస్తూ, అవి వాస్తవానికి దూరమని స్పష్టం చేసింది.

# 'మోదీ చరిత్రను వక్రీకరిస్తున్నారు

భారత ప్రధాని నరేంద్ర మోదీ 'చరిత్రను వక్రీకరించే వ్యక్తి' అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన ప్రధానిపై అనేక విమర్శలు చేశారు. గత నెలలో పార్లమెంటు వేదికగా 'వందేమాతరం' గీతంపై జరిగిన చర్చలో మోదీ చరిత్రను వక్రీకరించారని, రవీంద్రనాథ్ ఠాగూర్‌కు అపఖ్యాతి తెచ్చేలా వ్యవహరించారని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడం ద్వారా, జాతిపిత మహాత్మా గాంధీ జ్ఞాపకాలను, వారసత్వాన్ని మోదీ తుడిచిపెట్టేస్తున్నారని ఆరోపించారు.



### అసలేం జరిగింది?

జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా ప్రధానిపై విరుచుకుపడ్డారు. "గత నెలలో పార్లమెంటులో జాతీయ గేయంపై చర్చ జరిగింది. ఆ సమయంలో ప్రధాని, ఆయన సహచరులు వాస్తవాలను వక్రీకరించారు. గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడారు. కానీ చివరికి వారి బండారం బయటపడింది. ప్రధాని ఉద్దేశపూర్వకంగానే చరిత్రను తప్పుదోవ పట్టిస్తున్నారు. అందుకే ఆయన దేశంలోనే 'గ్రేటెస్ట్ డిస్టోరియన్' (చరిత్రను వక్రీకరించేవాడు)" అని జైరాం రమేశ్ ఘాటుగా విమర్శించారు.

### నేతాజీ పాత్రను దాచిపెట్టారు

నేతాజీ జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని జైరాం రమేశ్ కొన్ని చారిత్రక అంశాలను ప్రస్తావించారు. "1937లో వందేమాతరం గీతంలోని తర్వాతి చరణాలపై ఒక వివాదం నడిచింది. ఆ వివాదాన్ని పరిష్కరించడంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ కీలక పాత్ర పోషించారు. కానీ పార్లమెంటు చర్చలో ప్రధాని మోదీ ఈ విషయాన్ని ఉద్దేశపూర్వకంగానే దాచిపెట్టారు. ప్రజలకు నిజాలు తెలియకుండా చేశారు" అని ఆరోపించారు.

### జనగణమన, జై హింద్

నేతాజీకి సంబంధించిన మరికొన్ని ఆసక్తికర విషయాలను ఆయన గుర్తు చేశారు. ప్రముఖ చరిత్రకారుడు, నేతాజీ మనవడు సుగత బోస్ రాసిన విషయాలను జైరాం రమేశ్ ఉదాహరించారు. 1942 నవంబర్ 2న బెర్లిన్‌లో 'ఫ్రీ ఇండియా సెంటర్'ను నేతాజీ ప్రారంభించారు. అక్కడే ఆయన 'జనగణమన'ను జాతీయ గీతంగా ఎంపిక చేశారు. అలాగే 1943 అక్టోబర్ 2న సింగపూర్‌లో ఆజాద్ హింద్ ప్రభుత్వ నినాదంగా 'జై హింద్'ను ఎంచుకున్నారు. "దురదృష్టవశాత్తు ప్రధాని మోదీ గానీ, ఆయన పార్టీ నేతలు గానీ ఎప్పుడూ 'జై హింద్' అనే నినాదాన్ని నోటితో పలకరు. స్వాతంత్ర్య సమర యోధుల స్ఫూర్తిని వారు విస్మరిస్తున్నారు" అని విమర్శించారు.


### 'మహాత్ముడిని చంపేస్తున్నారు'

గాంధీజీ వారసత్వంపై మోదీ సర్కార్ దాడి చేస్తోందని కాంగ్రెస్ మండిపడింది. "1944 జూలై 6న సింగపూర్ రేడియో నుంచి మాట్లాడుతూ, నేతాజీ తొలిసారిగా మహాత్మా గాంధీని 'జాతిపిత' అని సంబోధించారు. కానీ నేటి ప్రధాని మోదీ, ఆ జాతిపిత ఆశయాలను సమాధి చేస్తున్నారు. గాంధీ పేరును ప్రజల జ్ఞాపకాల నుంచి చెరిపేయాలని చూస్తున్నారు. ఉపాధి హామీ పథకం రద్దు చేయడమే ఇందుకు తాజా నిదర్శనం. ఇది గాంధీ వారసత్వాన్ని దెబ్బతీయడమే" అని జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### వందేమాతరంపై రచ్చ

గత నెలలో జరిగిన పార్లమెంటు సమావేశాల్లో 'వందేమాతరం' గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రోజంతా చర్చ జరిగింది. ఈ చర్చలో అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. జాతీయవాదం అంశంపై మాటల యుద్ధం నడిచింది. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ వాద్రా ఈ చర్చలో పాల్గొని బీజేపీకి గట్టి కౌంటర్ ఇచ్చారు. నెహ్రూ విధానాలను సమర్థించుకుంటూనే, మోదీ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. అలాగే బీజేపీ వ్యూహాన్ని కాంగ్రెస్ బయటపెట్టింది. "వచ్చే ఏడాది బంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో లబ్ధి పొందడానికే బీజేపీ ఇప్పుడు వందేమాతరం చర్చను తెరపైకి తెచ్చింది. చరిత్రను వక్రీకరించి ఓట్లు దండుకోవాలని చూస్తోంది. దీనికి రాజకీయ రంగు పులుముతోంది" అని విపక్షాలు ఆరోపించాయి. మరోవైపు కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతోందని అధికార పక్షం ఎదురుదాడి చేసింది.

## డీఎంకే పార్టీకి కౌంట్‌డౌన్ మొదలైంది



**చెన్నై:** డీఎంకే పార్టీకి కౌంట్‌డౌన్ మొదలైందని.. తమిళ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ప్రధాని మోదీ అన్నారు. శుక్రవారం ఆయన తమిళనాడులో ఎన్డీఏ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. చెన్నై సమీపంలోని మదురాంతకం వద్ద జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. తమిళనాడులో ఎన్డీఏ గెలుపు ఖాయం అంటూ ధీమా వ్యక్తం చేశారు. డీఎంకేను సీఎంసీ ప్రభుత్వం(అవినీతి, మాఫియా, క్రైమ్) అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తమిళనాడు ప్రజలు ఈ పార్టీని వేరులతో సహా పెకిలించి మార్పు కోసం ఓటు వేయాలని నిర్ణయించుకున్నారంటూ మోదీ వ్యాఖ్యానించారు. వారసత్వ రాజకీయాలపై మోదీ మాట్లాడుతూ.. డీఎంకే ప్రభుత్వం కేవలం ఒకే కుటుంబం కోసం పనిచేస్తోందని విమర్శించారు. 2014 కంటే ముందు కేంద్రంలో కాంగ్రెస్, డీఎంకే అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన నిధుల కంటే, తమ ప్రభుత్వం తమిళనాడుకు మూడు రెట్లు ఎక్కువ నిధులు కేటాయించిందని మోదీ గుర్తుచేశారు. స్టాలిన్ ప్రభుత్వంలో డ్రగ్స్, మద్యం మాఫియాలు పెరిగిపోయాయంటూ ఆరోపించారు. ఎన్డీయేకు వేసే ప్రతి ఓటు తమిళనాడును మాదకద్రవ్యాల ముప్పు నుంచి విముక్తి చేస్తుందంటూ మోదీ చెప్పుకొచ్చారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్డీయే అధికారంలో ఉంటే (డబుల్ ఇంజిన్ ప్రభుత్వం) పెట్టుబడులను ఆకర్షించడం సులభమవుతుందన్నారు. దివంగత నేత జయలలిత హయాంలో శాంతిభద్రతలు, మహిళా రక్షణ బాగుండేదని.. ప్రస్తుత డీఎంకే ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందంటూ ప్రధాని మోదీ ఆరోపించారు.

## డబ్ల్యూహెచ్‌ఓకు బకాయిపడిన అమెరికా




కరోనా మహమ్మారిని అదుపు చేయడంలో, సంస్కరణలను అమలు చేయడంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) విఫలమైందని ఆరోపిస్తూ అమెరికా ఆ సంస్థ నుంచి వైదొలిగింది. ఈ మేరకు అమెరికా ఆరోగ్య, మానవ సేవల విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇక నుంచి డబ్ల్యూహెచ్‌ఓకు అమెరికా నుంచి వెళ్లే అన్ని రకాల నిధులను నిలిపివేస్తున్నామని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్యాలయాల నుంచి తమ దేశ సిబ్బందిని వెనక్కి పిలిపించినట్లు తెలిపింది.

డబ్ల్యూహెచ్‌ఓ సంస్థకు సంబంధించిన సాంకేతిక కమిటీలు, వర్కింగ్ గ్రూపుల నుంచి కూడా వైదొలుగుతున్నట్లు అమెరికా స్పష్టం చేసింది. అయితే, పరిమిత పరిధిలో డబ్ల్యూహెచ్‌ఓతో కలిసి పని చేయడానికి అవకాశం ఉంటుందని అమెరికా ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఈ సంస్థ నుంచి వైదొలుగుతామని పలుమార్లు హెచ్చరించారు. తాజాగా, అమెరికా అధికారికంగా డబ్ల్యూహెచ్‌ఓ నుంచి వైదొలుగుతూ కీలక నిర్ణయం తీసుకుంది.

### డబ్ల్యూహెచ్‌ఓకు బకాయిపడిన అమెరికా

డబ్ల్యూహెచ్‌ఓ నుంచి వైదొలిగే సమయానికి అమెరికా ఆ సంస్థకు భారీ మొత్తంలో బకాయి పడింది. 260 మిలియన్ డాలర్ల బకాయిలను అమెరికా డబ్ల్యూహెచ్‌ఓకు చెల్లించాల్సి ఉందని బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. ఇది భారతీయ కరెన్సీలో సుమారు రూ.2,382 కోట్లు. ఈ బకాయిని పూర్తిగా చెల్లించే వరకు డబ్ల్యూహెచ్‌ఓ నుంచి అమెరికా ఉపసంహరణ పూర్తి కాదని ఆ సంస్థ అధికారులు పేర్కొన్నారు. అయితే, సంస్థ నుంచి వైదొలగడానికి ముందు బకాయిలు చెల్లించాలనే నిబంధన ఏమీ లేదని అమెరికా అధికారులు స్పష్టం చేశారు.

## ఆ ఊరికి కరెంట్ బిల్లు రాదు ప్రభుత్వమే తిరిగి వాళ్లకు డబ్బులిస్తుంది

సాధారణంగా నెల తిరిగేసరికి కరెంట్ బిల్లు చూసి సామాన్యుడు హడలిపోతాడు. విద్యుత్ బిల్లులు కట్టలేక సతమతమవుతాడు. కానీ, ఆ ఊరిలో మాత్రం కరెంట్ బిల్లు శూన్యం. అసలు బిల్లు కట్టే పనే లేదు. పైగా కరెంట్ వాడినందుకు ప్రభుత్వమే ఆ ఊరి జనాలకు ఎదురు డబ్బులు ఇస్తోంది. వినడానికి ఆశ్చర్యంగా ఉంది కదూ? కానీ ఇది నిజం. గుజరాత్‌లోని బనస్కాంత జిల్లాలో ఉన్న 'రూపపుర' గ్రామం ఇప్పుడు దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. అక్కడ సూర్యుడే ఇప్పుడు సిరిసంపదలు కురిపిస్తున్నాడు. ఆ ఊరి తలరాతను సోలార్ పవరే మార్చేసింది. పల్లాన్‌పుర్ తాలూకాలోని రూపపుర గ్రామం బనస్కాంత జిల్లాలోనే పూర్తిగా సౌరశక్తిని వినియోగించుకుంటున్న తొలి గ్రామంగా రికార్డు సృష్టించింది. ఒకరిని చూసి ఒకరు, ఇలా ఊరంతా సోలార్ బాట పట్టింది. ఇప్పుడు గ్రామంలోని 90 శాతం ఇళ్లు, పొలాల వద్ద ఉన్న ఫామ్ హౌస్‌ల పైన సోలార్ ప్యానెల్స్ దర్శనమిస్తున్నాయి. సంప్రదాయ విద్యుత్ స్థానంలో సౌర విద్యుత్ వాడకం అక్కడ సర్వసాధారణమైపోయింది. పెరిగిన ధరలు, కరెంట్ చార్జీలతో సామాన్యుడి బతుకు భారంగా మారింది. ఈ ఆర్థిక భారం నుంచి బయటపడటానికి రూపపుర వాసులు తెలివైన నిర్ణయం తీసుకున్నారు. ఇళ్లపై సోలార్ సిస్టమ్స్ పెట్టుకున్నారు. దీంతో కరెంట్ బిల్లుల బాధ పూర్తిగా తప్పింది. కేవలం బిల్లు మిగలడమే కాదు, తాము వినియోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయిస్తున్నారు. ఫలితంగా ఏడాదికి ఒక్కో కుటుంబం రూ.5,000 నుంచి రూ.7,000 వరకు అదనపు ఆదాయాన్ని పొందుతోంది. వాళ్ల ఖాతాల్లో ప్రభుత్వమే డబ్బులు జమ చేస్తోంది. ఈ మార్పు రాత్రికి రాత్రే రాలేదు. విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రామస్థులతో ప్రత్యేకంగా 'గ్రామ సభ' నిర్వహించారు. సోలార్ ఎనర్జీ వల్ల కలిగే లాభాలను వివరించారు. అధికారులు చెప్పిన మాటలు గ్రామస్థులకు నచ్చాయి. ఒక్కొక్కరుగా సోలార్ ప్యానెల్స్ బిగించుకోవడం మొదలుపెట్టారు. ఇప్పుడు ఊరంతా సోలార్ మయమైంది. సాధారణంగా 3.30 కిలోవాట్ల సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలంటే సుమారు రూ.1.50 లక్షల వరకు ఖర్చవుతుంది. అయితే ఇందులో ప్రభుత్వం భారీ సబ్సిడీని అందిస్తోంది. ఏకంగా రూ.78,000 వరకు రాయితీ ఇస్తోంది. దీంతో వినియోగదారుడు కేవలం రూ.70,000 నుంచి రూ.80,000 చెల్లిస్తే సరిపోతుంది. ఇక్కడే 'బనస్ డెయిరీ' రూపంలో రైతులకు అదృష్టం కలిసొచ్చింది. చేతిలో డబ్బులు లేని పాడి రైతుల కోసం డెయిరీ యాజమాన్యం అద్భుతమైన స్కీమ్ తెచ్చింది. గ్రామంలోని పాడి రైతులకు 90 శాతం మొత్తాన్ని రుణం రూపంలో అందించింది.

# ఏఐ ఆవిష్కరణల అమలుకు 'ఐకమ్'

-మొదటిపేజీ తరువాయి

మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి, ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్, ఐకమ్ వ్యవస్థాపక సీఈవో ఫణి నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ప్రయోగాలతోపాటు ఆయా ఆవిష్కరణల అమలుకు కూడా అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ప్రపంచం ఏఐ పైలట్ దశ నుంచి విస్తృత అమలు దశలోకి మారుతున్న తరుణంలో బాధ్యతాయుతంగా, పారదర్శకంగా కృత్రిమ మేధను ఉపయోగించుకునే వేదికగా తెలంగాణను మేం ప్రపంచానికి పరిచయం చేస్తున్నామని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అమలుకు ఒక ప్రయోగ వేదికగా తెలంగాణను నిలిపే లక్ష్యంతో రూపొందించిన తొలితరం సంస్థగా 'ఐకమ్' నిలుస్తుందని రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్య సాధనకు వ్యూహాత్మక దిశ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఐకమ్ ద్వారా అది సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది భవిష్యత్ ఉద్యోగాలను సృష్టిస్తుందని రేవంత్ వివరించారు. భారత్‌ను టెక్నాలజీ వినియోగదారుడిగానే కాకుండా సృష్టికర్తగానూ మారుస్తుందని' అని సీఎం రేవంత్‌రెడ్డి విశ్వాసం వ్యక్తంచేశారు.

"ప్రపంచవ్యాప్తంగా అనేక ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) పాలసీలున్నాయి. పలు దేశాలు ఇప్పటికే ఏఐ మిషన్‌లను ప్రకటించాయి. వాటిలో చాలావాటికి సాధారణ లోపం ఒకటుంది. అదే అమలుకు అవసరమైన సంస్థాగత నిర్మాణం లేకపోవడం. 'ఐకమ్' ఆ లోపాన్ని భర్తీ చేస్తుంది. ఇది ఒక డిపార్ట్‌మెంట్ కాదు ఏకీకృత ఎకోసిస్టమ్. ఇది ఒక ల్యాబ్ కాదు విస్తృత జనాభా ప్రాతిపదికన సేవలందించే వేదిక. కృత్రిమ మేధపై ప్రయోగాల దశను దాటి జనాభా స్థాయికి తగ్గట్టుగా ఈ సాంకేతికతను అమలు చేసే సామర్థ్యాన్ని కలిగిన భారత సంస్థగా ఇది గుర్తింపు పొందుతుంది" – రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

ఆలోచనల నుంచి ప్రపంచ స్థాయి పరిష్కారాల వరకు : అనంతరం ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఆలోచనల నుంచి ప్రపంచ స్థాయి పరిష్కారాల దాకా స్పష్టమైన అమలు మార్గాన్ని 'ఐకమ్' అందిస్తుందని వివరించారు. ప్రభుత్వ వ్యవస్థలో ఉండి కూడా స్వయంప్రతిపత్తితో పనిచేసే దీని నిర్మాణం ప్రజల విశ్వాసాన్ని చూరగొంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఎజెంటిక్ ఏఐ యుగంలో బాధ్యతాయుత స్వయంప్రతిపత్తి' అనే అంశంపై నిర్వహించిన చర్చకు ఐకమ్ వ్యవస్థాపక సీఈవో నాగార్జున కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

**ఇవీ ఐకమ్ లక్ష్యాలు :**

భారీ స్థాయిలో ఏఐ స్కిల్ డెవలప్‌మెంట్

ఏఐ–ఫస్ట్ స్టార్టప్‌ల వేగవంతమైన అభివృద్ధి

పరిశోధన–ఇండస్ట్రీల మధ్య బలమైన అనుసంధానం

భారీ డేటాసెట్‌లు, అత్యాధునిక కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల కల్పన

పలు వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలు : ఐకమ్' ఆవిష్కరణ సందర్భంగా దావోస్‌లో ప్రపంచస్థాయి సంస్థలతో కృత్రిమ మేధ ఆధారిత అంశాలపై వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలు కుదిరాయి.

పియర్సన్ : బ్రిటన్‌కు చెందిన ప్రముఖ ఎడ్యుకేషన్, పబ్లికేషన్ సంస్థ ఇది. ప్రపంచ ప్రమాణాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అకాడమీగా దీనికి గుర్తింపు ఉంది. ఈ ఒప్పందం ద్వారా ఏఐ శిక్షణ, పాఠ్యప్రణాళిక, లెర్నింగ్ కంటెంట్, అంచనా విధానాలు, అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్లలో తన స్కిల్స్‌ను పియర్సన్ ఉపయోగించనుంది.

దుబాయ్ మల్టీ కమోడిటీస్ సెంటర్(డీఎంసీసీ) : ఇది తెలంగాణ–దుబాయ్ స్టార్టప్ కారిడార్. ఈ ఎంఓయూ ద్వారా రెండు దేశాల స్టార్టప్‌లకు సంబంధించిన అభివృద్ధికి అవకాశాలను అన్వేషించనున్నారు. రెండు దేశాల మార్కెట్లు, ఎకో సిస్టమ్‌లపై అవగాహన కల్పిస్తారు.

బ్లేజ్ ఇంక్ : అత్యాధునిక ఏఐ కంప్యూటింగ్ ఆర్‌అండ్‌డీ(పరిశోధన అభివృద్ధి) కేంద్రం

ఏఐ కోల్యాబ్(మెడ్‌స్టార్–జార్జ్‌టౌన్) : హెల్త్‌కేర్ అండ్ లైఫ్ సైన్సెస్ పరిశోధన

జర్నీ: ఏఐ ఆధారిత డిజైన్ అండ్ ఇమర్సివ్ డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్

# మేడారం మహాజాతరకు సర్వం సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

చెల్లిస్తున్నారు. భక్తులు తరలి వస్తారని అంచనాతో పోలీస్ శాఖ దర్శనం సందర్భంలో భద్రత, రద్దీ నియంత్రణ తదితర అంశాలకు ప్రాధాన్యమిచ్చి మరి ప్రణాళికలు తయారు చేసింది. ఈ ఏడాది జాతర ఏర్పాట్లలో సాంకేతికతకు పెద్దపీట వేయడం గమనార్హం. జాతర విధుల్లో పోలీసు శాఖది కీలక పాత్ర ఉంది. ఈ జాతర ముగిసే వరకు 25 మంది ఐపీఎస్‌ల పర్యవేక్షణలో 13 వేల మంది సిబ్బంది పని చేయనున్నారు. ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో మేడారంలో రామగుండం సీపీ పర్యవేక్షణలో గద్దెలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, జాతర కోర్ ఏరియాలో భక్తుల రద్దీ నియంత్రణ విభాగాలు పని చేసేలా కసరత్తు చేశారు. అలాగే జాతరలో పాత నేరస్థుల సంచారం, తప్పిపోయిన వారి గుర్తింపు, దర్శన సందర్భంలో రద్దీ, ట్రాఫిక్ సమస్యలను గుర్తించేలా కృత్రిమ మేధతో సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. వీటన్నింటి కోసం 20 డ్రోన్ కెమెరాలు, 450 సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంతో అనుసంధానించి నిఘా ఉంచుతున్నారు.



**సౌకర్యాలు ఇలా :**

ఇక్కడ గతంలో ఏకకాలంలో అమ్మవార్ల గద్దెలను 2000 మంది దర్శించుకుంటే ప్రాంగణం రద్దీగా మారేది. కాని ఇప్పుడు ప్రాంగణం విస్తరణతో ఒకేసారి 8–9 వేల మంది దర్శించుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు.

గతంలో సమ్మక్క–సారలమ్మ గద్దెల పక్కన పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలుండేవి. భక్తులు ఆ ప్రాంగణం లోపల వెనక్కి ముందుకు తిరిగేవారు. పునర్నిర్మాణంతో గద్దెలన్నీ ఒకే వరుసలోకి రావడంతో ఆ సమస్య వస్తుందని చెబుతున్నారు.

జాతరలో భక్తుల రద్దీ అనుగుణంగా ప్రైవేటు వాహనాలకు ఊరట్టం గ్రామం వద్ద 33 పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. అలాగే గద్దెలకు సమీపంలోనే ఆర్టీసీ బస్టాండ్, వీఐపీ వావానాలకు పార్కింగ్ సౌకర్యం ఉంటుంది. జాతర తేదీల్లో 3 లక్షల వాహనాలొచ్చినా నిలిపేందుకు సుమారుగా 2 వేల ఎకరాల స్థలాన్ని సిద్ధం చేశారు. గత సంవత్సరం కంటే ఈ సారి 500 బస్సులు పెంచనున్నారు. మహిళలకు ఆధార్ గుర్తింపుతో ఉచిత ప్రయాణ సౌకర్యం కొనసాగుతుంది.

మొబైల్ సిగ్నల్ కోసం బీఎస్ఎన్ఎల్ 10 తాత్కాలిక టవర్లను ఏర్పాటు చేసింది.

మేడారం మహాజాతరకు చేరుకొనే మార్గంలో 39 చోట్ల రహదారులను అభివృద్ధి చేశారు. అంతేకాదు తాడ్వాయి, పస్రా, బయ్యక్కపేట మార్గాల్లో ఇరుకు రోడ్లను విస్తరించారు. మేడారంలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించారు. జంపన్న వాగు వద్ద ఆధునికీకరించారు.

మేడారంలోని రెండు 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రాల సామర్థ్యాన్ని పెంచారు. నార్లాపూర్ వద్ద మరో 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మించారు. విద్యుత్ కోసం 259 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. జంపన్నవాగు పై నుంచి వెళ్లే లైన్ల కోసం ఎత్తయిన టవర్లను కూడా నిర్మించారు.

ప్రాంతాల వారీగా ఇలా వెళ్తె మరింత సులువుగా :

ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్, మెదక్, వరంగల్ ప్రాంతాల వారంతా ములుగు, పస్రా మీదుగా రావాలి.

ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల వాసులు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం, తాడ్వాయి మండలం కాల్వపల్లి మీదుగా మేడారం సమీప ఊరట్టం స్తూపం వద్దకు చేరుకోవాలి.

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ సహా భద్రాద్రి కొత్తగూడెం నుంచి వచ్చే వారు ఏటూరునాగారం వైపు నుంచి కొండాయి మీదుగా వెళ్లాలి.

ఇక తిరుగు ప్రయాణంలో వరంగల్ వైపు వెళ్లే వాహనాలు ములుగు మీదుగా కాకుండా బయ్యక్కపేట మీదుగా భూపాలపల్లి వైపు నుంచి మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చొరవ.. మేడారం జాతరకు నిధులు విడుదల**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవతో కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ, గిరిజన మంత్రిత్వశాఖలు రూ.3.70కోట్లు విడుదల చేశాయి. మేడారం చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించడం కోసం గిరిజన సర్క్యూట్ పేరిట గతంలో రూ. 80 కోట్లతో ఆయా ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించింది. యునెస్కో గుర్తింపు లభించిన రామప్ప దేవాలయ అభివృద్ధి కోసం రూ.140 కోట్లు ఖర్చు చేస్తోంది. అమ్మవార్లకు బంగారం సమర్పించి మొక్కులు తీర్చుకోవడానికి రాష్ట్రం నలుమూలల నుంచి, చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం జాతర జరిగే నాలుగు రోజుల పాటు దక్షిణ మధ్య రైల్వే 30 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది.

# రాజకీయ రంగుపులుముకున్న నైనీ కోల్ మైన్స్

**హైదరాబాద్ :** నైనీ కోల్ మైన్స్ టెండర్ల విషయంలో సింగరేణి కీలక నిర్ణయం తీసుకుంది. ఇవాళ్టి నుంచి తీసుకోవాల్సిన బిడ్స్ ని రద్దు చేస్తు నట్లు ప్రకటించింది. పాలనాపరమైన కారణాలతో టెండర్లు రద్దు చేసినట్లు చెప్పింది. నిబంధనలు, టెండర్లపై పాలక మండలిలో మరోసారి చర్చిస్తామని ఆ తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని సింగరేణి అధికారులు తెలియజేశారు. ఇటు నైనీ కోల్ బ్లాక్ టెండర్ల విషయంలో సింగరేణి పాలక మండలిని కేంద్ర బొగ్గు గనుల శాఖ ప్రశ్నించింది. సంస్థ విధించిన నిబంధనలపై పాలక మండలి ఎందుకు చర్చించలేదని అడిగింది. చర్చించి ఉంటే టెండర్ల విషయంలో అవినీతి ఆరోపణలు ఎందుకు వస్తున్నాయని, టెండర్ వేయాలనుకున్న కంపెనీలకు ఎందుకు సైట్ విజిట్ ధృవీకరణ పత్రాలు ఇవ్వడం లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ అడిగింది. నిబంధనలు, టెండర్లపై పాలక మండలిలో చర్చించి మరోసారి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు సింగరేణి అధికారులు. కాగా.. బొగ్గు బ్లాక్ ల టెండర్ల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. నైనీ కోల్ మైన్స్ టెండర్స్ విషయంలో బీఆర్ఎస్, బీజేపీ సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.తెలంగాణలో బొగ్గు గనుల టెండర్లపై రాజకీయ వివాదం చెలరేగింది. నైనీ బొగ్గు గని టెండర్ నోటిఫికేషన్ ప్రభుత్వం రద్దు చేయడంతో ఒక్కసారిగా కోల్ వార్ మొదలైంది. నోటిఫికేషన్ రద్దుపై సీబీఐ విచారణ జరిపించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. సీఎం రేవంత్ కి, బీజేపీకి చీకటి ఒప్పందం జరిగిందని.. అందుకే రద్దు చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. సీఎం రేవంత్ బావమరిదికి లబ్ది చేకూర్చేందుకే సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధన తెచ్చారని హరీశ్ రావు అంటున్నారు. బొగ్గు కుంభకోణాన్ని బయటపెట్టినందుకే హరీశ్ రావుకి నోటీసులు ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు.సింగరేణి చుట్టూ రాజకీయ వివాదం చెలరేగింది. బొగ్గు గనుల కేటాయింపులపై బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ఒడిశాలోని నైనీ బొగ్గు గనుల టెండర్లతో వివాదం మొదలైంది. రేవంత్ రెడ్డి బావమరిదికి లబ్ది కలిగించేందుకే తెలంగాణ ప్రభుత్వం టెండర్ల నిబంధనల్లో మార్పులు చేసిందని బీఆర్ఎస్ ఆరోపించింది. సైట్ విజిట్ సర్టిఫికెట్ అనే కొత్త విధానం తెచ్చి గ్లోబల్ టెండర్లలో పాల్గొంటున్న వారి వివరాలు తెలుసుకుని వారు టెండర్లలో పాల్గొనకుండా చేసి రేవంత్ రెడ్డి బావమరిదికి టెండర్లు దక్కేలా తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ ఆరోపించింది. అందులో భాగంగానే నైనీ బొగ్గు గనుల కేటాయింపు టెండర్లను భట్టి విక్రమార్క రద్దు చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.నైనీ బొగ్గు గనుల టెండర్ల రద్దుతో పాటు ఇతర బొగ్గు గనుల కేటాయింపులపై సీబీఐ విచారణకు బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ బావమరిది టెండర్ల విషయాన్ని బయటపెట్టినందుకే ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్ రావుకి నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచారని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు.




## కాంగ్రెస్‌లో దండుపాళ్యం ముఠా

**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసు అంతులేని కథలా సాగుతోందని.. నోటీసులు, విచారణ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ డ్రామాలు ఆడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. ఈ కేసులో సిట్ విచారణ బయల్దేరే ముందు తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు, కీలక నేతలతో భేటీ అయ్యారాయన. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వం రాజకీయ డ్రామా ఆడుతోంది. ఉద్యమంలోంచి పుట్టిన పార్టీ బీఆర్ఎస్. ఎన్నికేసులు పెట్టినా భయపడకుండా పోరాడిన నాయకత్వం మా పార్టీది. రాష్ట్రం కోసం రాజీలేని పోరాటాలు చేశాం. అనుక్షణం ప్రజలు, రాష్ట్రం కోసమే పని చేశాం. ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన ఘనత కేసీఆర్‌ది. కావాలనే బురద చల్లడం, హింసించడం మేం ఏనాడూ చేయలేదు. మేం ఎప్పుడూ టైం పాస్ కార్యక్రమాలు చేయలేదు అని కేటీఆర్ అన్నారు. పిచ్చోడి చేతిలో రాయిలా.. అసమర్థుడి జీవన యాత్రలా కాంగ్రెస్ పాలన ఉంది. ఒక్కో రోజు ఒక్కో డ్రామాతో నెట్టుకొస్తున్నారు. మేం ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదు. అక్రమ, అనైతిక పనులు చేయలేదు. అయినా నాపై తీవ్ర వ్యక్తిత్వ హననం చేస్తున్నారు. ఇందుకు ఎవరు బాధ్యులు? రేవంతా? అధికారులా?. నేను డ్రగ్స్ తీసుకుంటానని.. హీరోయిన్లతో సంబంధాలు ఉన్నాయని దిక్కుమాలిన వార్తలు రాయిస్తున్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పదేళ్లపాటు రాష్ట్రం కోసం చిత్తశుద్ధితో పని చేశా. ప్రభుత్వం పోలీసులు కలిసి గత రేండేళుగా.. అంతులేని కథలా ఫోన్ ట్యాపింగ్ కేసును నడిపిస్తున్నారు. ఎంక్వైరీలకు భయపడేది లేదు. ఈ కేసుతో నాకేం సంబంధం లేదు. అయినా పిలిస్తే 10సార్లు విచారణకు వెళ్తా.. సింగరేణిలో వేల కోట్ల కుంభకోణం జరిగిందని హరీష్‌రావు చెప్పారు. ఆ కుంభకోణంలో సీఎం రేవంత్‌రెడ్డి బామర్ది సృజన్ రెడ్డిది కీలక పాత్ర. సింగరేణితో సీఎం రేవంత్ ఎలా ఫుట్‌బాల్ ఆడుతున్నారో హరీష్ వివరించారు. అలా మాట్లాడినందుకే నోటీసులు ఇచ్చారు. సిట్ నోటీసులు, విచారణ టైంపాస్ ప్రోగ్రాం అని కేటీఆర్ అన్నారు. మా ప్రభుత్వం ఏం తప్పు చేసిందని అడుగుతున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ జరగడం లేదని చెప్పగలరా?. కాంగ్రెస్ ప్రభుత్వంలో దండుపాళ్యం ముఠా ఉంది. వాళ్ల దోపిడీ బయటపెడతామనే నోటీసులు, విచారణ పేరిట ఇబ్బంది పెడుతున్నారు. రేవంత్‌కు, ఆయన తొత్తులుగా ఉన్న పోలీసులను వదిలేది లేదు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ విధానాలను ప్రశ్నిస్తూనే ఉంటాం.. అని కేటీఆర్ అన్నారు.

## సొంత పార్టీ నేతల ఫోన్లనూ ట్యాప్ చేసిన ఘనత బీఆర్ఎస్‌దే

-మొదటిపేజీ తరువాయి

చెబుతున్నారు" అని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

**బీఆర్ఎస్‌పై దయాకర్ తీవ్ర విమర్శలు**

జైలుకు వెళ్లాలని బీఆర్ఎస్ నేతలకు బాగా ఉబలాటంగా ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఎద్దేవా చేశారు. "తెలంగాణలో ఎన్నికలంటే డబ్బులు, ప్రలోభాలు ఉండాలనే విధంగా బీఆర్ఎస్ తయారు చేసింది. మీరు చేసిన పాపాలు, తప్పిదాలపై మరో ఐదేళ్లు విచారణ చేసినా సమయం సరిపోదు. డ్రోన్ కేసులో రేవంత్‌రెడ్డిని జైలుకు పంపారు. ప్రొఫెసర్ కొదండరామ్ ఇంటి తలుపులు బద్దలు కొట్టి అరెస్ట్ చేశారు. మేమెప్పుడూ రాజకీయ క్షక్ష సాధింపునకు పాల్పడలేదు. సిట్ అధికారులు, పోలీసులను కేటీఆర్ బెదిరిస్తున్నారు. అనైతిక రాజకీయాలు చేస్తున్నారు" అని విమర్శించారు.

**కేటీఆర్, హరీశ్‌పై బల్మూరి వెంకట్ ఫిర్యాదు**

మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ విచారణ సందర్భంగా పోలీసు అధికారులను వారిద్దరు బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## పెట్టుబడుల వేటలో రేవంత్



**హైదరాబాద్ :** ఏ రాష్ట్రానికి అయినా సరే పెట్టుబడులు చాలా అవసరం. ఎందుకంటే పెట్టుబడుల ద్వారానే ఆదాయం సమకూరుతూ ఉంటుంది. ఉద్యోగాలను కల్పించే అవకాశం ఉంటుంది. ఆర్థికంగా రాష్ట్రాన్ని బలోపేతం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ పెట్టుబడుల కోసమే ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి దావోస్ వెళ్లిపోయారు?దావోస్ ప్రాంతంలో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఆయన పాల్గొంటున్నారు. తెలంగాణలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్కిల్ డెవలప్మెంట్, స్పోర్ట్స్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలతో మూడు జోన్ల నమూనాలను దావోస్ వేదికపై ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు విశ్లేషించారు. క్యూర్, ప్యూర్, రేర్ ఆర్థిక అభివృద్ధి వ్యూహంతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సిటీ నెట్–జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టుగా, దేశంలో సుస్థిర అభివృద్ధికి రోల్ మోడల్ సిటీగా నిలుస్తుందని శ్రీధర్ బాబు అభిప్రాయం వ్యక్తంచేశారు.తెలంగాణ సమగ్రాభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక అద్భుత ఫలితాలను ఇస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఏరోస్పేస్, డిఫెన్స్, బయో–డిజైన్, సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ పరిపూర్ణ అనుకూలతలున్నాయని వివరించారు. కాలుష్యాన్ని తగ్గించే విధంగా ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెట్టిందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి దావోస్ వేదికపై పారిశ్రామిక వేత్తలకు తెలిపారు.తెలంగాణ రైజింగ్ పేరుతో ఆయన పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో 23 వేల కోట్ల పెట్టుబడిలను పెట్టేందుకు అనేక సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది. డక్టైల్ ఐరన్ పైపుల తయారీలో ప్రపంచ వ్యాప్తంగా పేరున్న రష్మీ గ్రూపు తెలంగాణ రాష్ట్రంలో 12,500 కోట్ల పెట్టుబడితో స్టీలు ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేయనుంది. స్లోవేకియ దేశానికి చెందిన న్యూక్లర్ ప్రొడక్ట్ సంస్థ 6000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. స్మాల్ మాడ్యూల్ రియాక్టర్ ఆధారిత విద్యుత్ ప్రాజెక్టు ను తెలంగాణలో ఏర్పాటు చేయబోతోంది.సౌందర్య ఉత్పత్తుల తయారీలో పేరు ఎన్నికల లోరియల్ అనే సంస్థ 3500 కోట్ల పెట్టుబడితో గ్లోబల్ టెక్ హబ్ ను తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేయబోతోంది. అమెరికాలో విమానయాన రంగంలో పేరుపొందిన సర్గార్డ్ అనే సంస్థ.. దశలవారీగా 1 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది.. ఇందులో భాగంగా అనేక సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకోనుంది. రష్మీ గ్రూప్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో 12,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని తెలుస్తోంది.ప్రపంచవ్యాప్తంగా బీర్లను తయారు చేసే అతిపెద్ద కంపెనీగా పేరు తెచ్చుకున్న ఏబి ఇన్ బెవ్.. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న తన తయారీ యూనిట్ ను మరింత విస్తరించబోతోంది. దీనికోసం భారీగా పెట్టుబడులు పెట్టబోతోంది. తద్వారా వేలాది మందికి ఉపాధి లభించబోతోంది. బ్లైజ్ అనే సంస్థ వ్యవస్థాపకుడు దినకర్ మునగాల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇప్పటికే తమ సంస్థ ఆధ్వర్యంలో రీసెర్చ్ డెవలప్మెంట్ సెంటర్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.. త్వరలోనే హెల్త్ కేర్ దయాగ్నస్టిక్స్, మ్యానుఫ్యాక్చరింగ్, ఆటో మేషన్, ఎనర్జీ ఎఫిషియన్సీ వంటి రంగాలలో పెట్టుబడులు పెడతామని దినకర్ వెల్లడించారు. గత ఏడాది జరిగిన సదస్సులో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం భారీగా పెట్టుబడులను ఆకర్షించింది. ఈసారి కూడా అదే స్థాయిలో పెట్టుబడులను ఆకర్షిస్తున్నది.

# 24 నెలలు..1,350 కోట్లు..

**షాద్ నగర్ లో అభివృద్ధి జాతర**

**ప్రజా నాయకుడిగా ప్రగతి వెలుగులు పంచి నేటికి రెండేళ్లు..**

**రెండేళ్లలో ఎన్నెన్నో అభివృద్ధి కార్యక్రమాలు..**

**నిత్యం గ్రామాలలో సందడి.. అన్ని వర్గాలకు న్యాయం..**

**ఎమ్మెల్యే శంకర్ రెండేళ్ల పాలనలో ఎన్నెన్నో మలుపులు..**

**రేపు చౌడమ్మ గుట్ట వద్ద ఉదయం 8గంటలకు ప్రత్యేక పూజలు..**

**షాద్ నగర్ లో కాంగ్రెస్ శ్రేణుల భారీ ర్యాలీ**

**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** ప్రతినిత్యం పోరాటం చేసిన వాడే నాయకుడిగా నిలుస్తాడు.. ప్రజల హృదయాలను గెలుస్తాడు.. నిరుపేద కుటుంబంలో జన్మించి నాయకుడిగా పయనించి ఒక్కో అడుగు ముందుకు సాగుతూ తాను అనుకున్న లక్ష్యానికి చేరువ కావడానికి ఎన్నో పోరాటాలు చేశాడు.. ప్రస్తుతం పాలన ద్వారా సవాలుగా తీసుకొని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు పోరాటం చేస్తున్నాడు.. రెండేళ్ల ఈ పోరాటంలో ఎన్నెన్నో మలుపులు.. ఎన్నెన్నో గెలుపులు.. ఆ పోరాట యోధుడు ఎవరో కాదు.. సాక్షాత్తు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. ఎమ్మెల్యేగా పాలనలో రేపటికి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా షాద్ నగర్ పట్టణంలో రేపు భారీ కార్యక్రమాలను పార్టీ శ్రేణులు అభిమానులు ఏర్పాటు చేశారు. చౌడమ్మ గుట్ట ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం భారీ ర్యాలీ కాన్వాయిలు పట్టణంలో సందడి చేయనున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీకి సంబంధించిన అన్ని వర్గాల శ్రేణులు ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కాంగ్రెస్ పార్టీ పిలుపునిస్తుంది. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రెండేళ్ల ప్రగతి గురించి ప్రత్యేకంగా చెప్పుకుంటే.. కష్టాలను జయిస్తూ.. విజయాలను సాధిస్తూ.. పేదరికంకి మించిన శాపం ఉండదు.. అలాంటి పేదరికంలో పుట్టిన వాళ్లు ఆశపడడం కూడా తప్పే.. కానీ తాను ఆశపడ్డాడు.. కలలు కన్నాడు.. అబ్దుల్ కలాం మార్గంలో తన కలలను సాకారం చేసుకోవాలనుకున్నాడు.. అందుకే కళాశాల చదువులు పూర్తికాగానే రాజకీయాల వైపు అడుగులు వేశాడు. చిన్న కులం అని, పేదవాడని గ్రామంలో ఎన్నో అవమానాలు ఎదురైనా నిలదొక్కుకొని తొలి అడుగులోనే గ్రామ సర్పంచ్ గా విజయం సాధించి తానేమిటో నిరూపించాడు. అయితే అది తొలిమెట్టు మాత్రమే.. ఆయన ఆలోచనలు వేరు.. ఏనాటికైనా షాద్ నగర్ ఎమ్మెల్యేగా అధికారంలోకి రావాలనేది ఆయన కల. అందుకోసం గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి నాయకుడిగా ఎదిగి ఎన్నెన్నో ప్రయత్నాలు మొదలుపెట్టాడు. 2009లో కాంగ్రెస్ తరపున టికెట్ ఆశించి విఫలమయ్యాడు. 2014లోనూ ఇదే పరిస్థితి.. ఇక లాభం లేదని 2018లో బీఎస్పీ తరపున రంగంలోకి దిగాడు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లో హేమాహేమీలు ఉన్నప్పటికీ వాళ్ళందరినీ ఆశ్చర్యపరుస్తూ 27 వేల ఓట్లకు పైగా సాధించి ఒక్కసారిగా నియోజకవర్గంలో సంచలనంగా మారాడు. కట్ చేస్తే.. ఎక్కడ పోగొట్టుకున్నాడో.. ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలని పెద్దవాళ్లు చెప్తుంటారు. అలాగే బీఎస్పీ తరపున పోటీచేసిన ఆయన తన తప్పు తెలుసుకొని సొంతగూటికి చేరాలనుకున్నాడు. ఆయన సొంత గుడికి వచ్చే సమయానికి కాంగ్రెస్ పార్టీలో ఉన్న అగ్ర నాయకులందరూ బీఆర్ఎస్ వైపు వెళ్లిపోయారు. కాంగ్రెస్ పార్టీ ఖాళీ.. పార్టీ మొత్తం నైరాశమే.. అయినా సరే తనకు పార్టీ, పార్టీకి తాను ఉపయోగపడాలనుకున్నాడు. ముందుగా నియోజకవర్గంలో పార్టీని ప్రతిష్టపరిచేందుకు ప్రయత్నించాడు. ఒక్కో ఇటుక జోడించి తిరిగి నియోజకవర్గంలో కాంగ్రెస్ కోటను నిలబెట్టాడు. ఫలితం గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన సాధించిన ఘనవిజయం. కొందరు నేతలు పార్టీ నుంచి వెళ్లిపోయిన, కొందరు అవాంతరాలు సృష్టించిన ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆయన తన సత్తా ఏమిటో తనని తక్కువ అంచనా వేసిన వారికి చూపించాడు.. ఇక పాలన విషయానికి వస్తే..ఎన్నో.. ఎన్నెన్నో.. గత రెండేళ్ల కాలంలో ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి చేసిన ప్రగతి కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయి.. ముఖ్యంగా ఎప్పటినుంచో అర్ధంతరంగా ఉండిపోయిన రైల్వే వంతెన కొన్ని నిధులు మంజూరు చేయించడం, అస్తవ్యస్తంగా ఉన్న పాత జాతీయ రహదారిని విస్తరించడం, తాజాగా పరిగి రోడ్డు విస్తరణ ఇలాంటి కార్యక్రమాలు జనాలను ఆకట్టుకోగా, గ్రామీణ ప్రాంతాలలో భవన సముదాయాల కల్పన, వంద పడకల ఆసుపత్రి కి అదనపు నిధులు తెచ్చి సకల సదుపాయాలతో ముందు ఉంచడం, యువత కోసం స్టేడియం బాగు చేయడం. అన్నింటికీ మించి తన సొంత నిధులకు దాతల విరాళాలను సమకూర్చి అత్యాధునికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మించడం ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పనితీరును




చాటుతాయి. పురపాలకలో భవన నిర్మాణాలు, సిసి రోడ్లు, అంతర్గత కాలువ పనులు, గ్రామీణ ప్రాంతాలకు రహదారులు, పంచాయతీలకు భవనాలు.. ఇలా పలు కార్యక్రమాలకు 1350 కోట్ల రూపాయలు ఆయన సమకూర్చారు. ప్రస్తుతం ఇప్పుడు 90 శాతం వరకు పనులు కొనసాగుతున్నాయి. పాలనలో నిత్యం ప్రజల మధ్య ఉండి వారి సమస్యలు తెలుసుకోవడం, అవసరమైన వాటిని అందించడం ద్వారా గుర్తింపు తెచ్చుకున్నారు. అన్నింటికీ మించి నిరుపేదలకు కల్యాణ లక్ష్మి, షాది ముబారక్, అనారోగ్య బాధితులకు సీఎం సహాయనిది గతంలో ఏ ఎమ్మెల్యే ఇవ్వనంత పెద్ద ఎత్తున మంజూరు చేయించి ఘనతను చాటారు. సంబరాలే సంబరాలు.. ఎమ్మెల్యే రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న శుభ సందర్భంలో నేతలు, కార్యకర్తలు భారీ ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా రేపు ఉదయం ఎనిమిది గంటలకు చౌడమ్మ గుట్ట ఆంజనేయస్వామి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూజా కార్యక్రమాలలో పాల్గొంటారు. అనంతరం అక్కడి నుంచి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించేందుకు నేతలు కార్యకర్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని నేతలు కోరుతున్నారు..

## జమ్మికుంట ప్రజాసేవకు కొత్త ఊపిరి

**కాంగ్రెస్‌లో చేరిన నిరుపేదల వైద్యుడు డాక్టర్ సూరంజన్**

**మారనున్న సేవా హస్తం**



**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** జమ్మికుంట పట్టణంలో నిరుపేదల వరంగా పేరుగాంచిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ సూరంజన్ కాంగ్రెస్ పార్టీలో చేరడం రాజకీయంగా, సామాజికంగా విస్తృత చర్చకు దారితీసింది. ఎన్నో ఏళ్లుగా వైద్య వృత్తిలో కొనసాగుతూ పేదలకు ఉచిత వైద్యం అందించి, వందలాది కుటుంబాలకు ఆశగా నిలిచిన ఆయనఇప్పుడు ప్రజాసేవను మరింత విస్తృతంగా చేయాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాహిత సంక్షేమ పథకాలు, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల జీవితాల్లో వస్తున్న మార్పులు తనను బాగా ఆకట్టుకున్నాయని డాక్టర్ సూరంజన్ తెలిపారు. అలాగే హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలితాలను చూసి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. "పేదల పక్షానే నా పోరాటం" ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు నిజమైన న్యాయం జరుగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం, అలాగే ఒడితల ప్రణవ్ చేస్తున్న ప్రజాసేవా కార్యక్రమాలు నాకు ఎంతో ప్రేరణనిచ్చాయి. ప్రణవ్ ఆధ్వర్యంలో జమ్మికుంట ప్రజలకు సేవ చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అని అన్నారు. ఇప్పటివరకు వైద్యుడిగా అందించిన సేవను, ఇకపై ప్రజాప్రతినిధిగా మరింత బలంగా కొనసాగించడమే తన లక్ష్యమని డాక్టర్ సూరంజన్ స్పష్టం చేశారు. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో పేదల సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల అభివృద్ధి, ఆరోగ్యంపరిశుభ్రతవిద్య వంటి రంగాల్లో అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. జమ్మికుంటకు బలమైన గొంతు కాంగ్రెస్ పార్టీలో చేరడం ద్వారా జమ్మికుంట ప్రజలకు మరింత బలమైన గొంతు లభిస్తుందని, ఇది సామాన్య ప్రజల్లో విశ్వాసాన్ని పెంచే పరిణామమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల కోసం పనిచేసిన వ్యక్తి ప్రజాజీవితంలోకి రావడం జమ్మికుంట భవిష్యత్ అభివృద్ధికి దోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

## రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంతో స్థానిక సంస్థలపై ఫోకస్

**జమ్మికుంట 17వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి సుంకరి రమేష్**



**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో స్థానిక సంస్థల ఎన్నికలకు రాజకీయ ప్రాధాన్యం మరింత పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు నేరుగా ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో, మున్సిపల్ ఎన్నికలు అధికార పార్టీకి ఒక పరీక్షగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు రాజకీయంగా కీలక కేంద్రంగా మారింది. ఈ వార్డుకు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా సీనియర్ నాయకుడు సుంకరి రమేష్‌ను బరిలో దింపడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత నలభై సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ, పార్టీ పటిష్టత కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడిగా సుంకరి రమేష్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. పార్టీకి అనుకూలప్రతికూల పరిస్థితులు ఎదురైన ప్రతిసారీ కాంగ్రెస్ పక్షాన నిలబడి పని చేసిన అనుభవం ఆయనకు ప్రజల్లో విశ్వాసాన్ని తెచ్చిపెట్టిందని స్థానిక కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ప్రజలతో అనుబంధమే బలం సుంకరి రమేష్ రాజకీయ ప్రయాణంలో ముఖ్యమైన అంశం ప్రజలతో నేరుగా మమేకమవడమేనని వార్డు వాసులు పేర్కొంటున్నారు. చిన్న సమస్య నుంచి పెద్ద సమస్య వరకు ప్రజల మాట వినే నాయకుడిగా ఆయనకు పేరు ఉంది. మౌలిక వసతులు, డ్రైనేజీ, తాగునీరు, వీధిదీపాలు, రహదారుల వంటి అంశాలపై ఎప్పటికప్పుడు అధికారులను సంప్రదిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని స్థానికులు గుర్తు చేస్తున్నారు. కరోనా కష్టకాలంలో చేసిన సేవలు ప్రపంచవ్యాప్తంగా కల్లోలం సృష్టించిన కరోనా మహమ్మారి సమయంలో సుంకరి రమేష్ ముందుండి చేసిన సేవలను ప్రజలు ప్రత్యేకంగా గుర్తుచేసుకుంటున్నారు. ఆ సమయంలో రాజకీయాలకు అతీతంగా పేదలకు నిత్యావసర సరుకులు, మందులు, వైద్య సహాయం అందించడంలో కీలక పాత్ర పోషించినట్టు వారు చెబుతున్నారు. ఇళ్లకు ఇళ్లకు వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవడం, అవసరమైన వారికి సహాయం అందించడం ద్వారా వార్డు ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో అభివృద్ధి ఆశలు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో, స్థానిక సంస్థలకు అభివృద్ధి నిధులు సులభంగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ప్రజలు భావిస్తున్నారు. అనుభవం ఉన్న నాయకుడిగా సుంకరి రమేష్‌ను గెలిపిస్తే 17వ వార్డులో అభివృద్ధి పనులు వేగవంతమవుతాయన్న నమ్మకం వార్డు వాసుల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వంమున్సిపాలిటీవార్డు స్థాయి మధ్య సమన్వయం బలపడితే సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికల్లో విజయం దిశగా కాంగ్రెస్ ఈ నేపథ్యంలో 17వ వార్డులో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రచారాన్ని మరింత ఉధృతం చేస్తున్నాయి. రాష్ట్రంలో అధికార పార్టీగా ఉన్న కాంగ్రెస్‌కు ప్రజల నుంచి వస్తున్న స్పందన తమ అభ్యర్థి విజయానికి దోహదపడుతుందని నాయకులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసిన సుంకరి రమేష్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని వార్డు ప్రజలు కోరుకుంటుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది

## కమలాపూర్‌లో పోలీస్ శాఖ అధికారులకు ఘన వీడ్కోలు స్వాగతం



**లిసామాన్యుడి అస్త్రం కమలాపూర్ :** ఈరోజు కమలాపూర్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న హరికృష్ణ, కి వీడ్కోలు తెలిపి, ఆ స్థానంలో నూతనంగా బాధ్యతలు స్వీకరిస్తున్న పి. నవీన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ స్వాగతం పలుకుతూ శాలువాలతో సత్కరించిన కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి హాజరుకాగా, సన్మానం చేసిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలసాని రమేష్ గౌడ్, మాజీ ఎంపీపీ తడుక శ్రీకాంత్, విష్ణుదాసు వంశీధర్ రావు, మార్కెట్ డైరెక్టర్ సముద్రాల కృష్ణ, నల్లాని సురేష్, పల్లె సంతోష్, తక్కళ్లపల్లి అశోక్ రావు, వార్డు మెంబర్లు మౌటం రమేష్, గంధసిరి బిక్షపతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో సామూహిక అక్షర బ్యాసం



**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ పట్టణం లోని గిర్నిగడ్డ లోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం రోజున వసంత పంచమి రోజున బి పూర్ణిమ అంగన్వాడి సూపర్వైజర్ ఎల్ రాములమ్మ అంగన్వాడీ టీచర్ ఆధ్వర్యంలో అంగన్వాడి చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో చిన్నారులు వారి తల్లిదండ్రులు మరియు సూపర్వైజర్ కవిత వసంత ఐసిడిఎస్ స్టాఫ్ శ్రీకాంత్ రమేష్ మరియు తదితరులు పాల్గొన్నారు

## మహిళలకు శిక్షణ ద్వారా ఉపాధి రక్షణ..

**మైనారిటీ సంక్షేమ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్**

**ఆలియా సుల్తానాను అభినందించిన మహ్మద్ అలీఖాన్ బాబర్**

**మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత శిక్షణ..**



**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** మహిళలకు సరైన శిక్షణ అందించడం ద్వారా వారిని ఉపాధి వైపు నడిపించేందుకు కృషి చేస్తున్నామని మైనారిటీ సంక్షేమ చైర్మన్ ఒబెధుల్లా కొత్వాల్ అన్నారు. ఇటీవలే ఆలియా సుల్తానాను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అదే విధంగా షాద్ నగర్ పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ బాబర్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో మైనార్టీ మహిళలకు ఉచితంగా కాంగ్రెస్ ప్రభుత్వం తరపున 60 రోజుల బ్యూటీ పార్లర్, అడ్వాన్స్ మేకప్ నేర్పించేందుకు శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం ఏదో ఒక కృషి చేస్తూనే ఉందన్నారు. మహిళలు ఉపాధి దిశగా ఉన్నత స్థాయికి ఎదిగితే పేదరికం దానంతట అదే దూరమవుతుందని పేర్కొన్నారు. అది దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను అన్ని విధాల ఆదుకునేందుకు కృషి చేస్తున్నారని వెల్లడించారు.మహిళా సేవ మండల అధ్యక్షురాలు అలియా సుల్తానా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఆమెకు ధ్రువపత్రాన్ని అందజేశారు. పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, సయ్యద్ ఖాదీర్, మెహబూబ్, బాబా, సమద్ తదితరులు పాల్గొన్నారు..

## ఓటు హక్కుపై విద్యార్థినులకు అవగాహన

**జమ్మికుంట గర్ల్స్ హై స్కూల్+1లో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా**



**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** జమ్మికుంట పట్టణంలోని గర్ల్స్ హై స్కూల్+1లో జాతీయ ఓటర్ల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు ఓటర్ల ప్రతిజ్ఞ చేసి, ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల తమ బాధ్యతను గుర్తు చేసుకున్నారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తి ఓటులోనే ఉందని, ప్రతి పౌరుడు తన ఓటు హక్కును విలువైనదిగా భావించి బాధ్యతాయుతంగా నియోగించుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థినులకు వివరించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు కీలకమని, మంచి పాలన, పారదర్శకత, సమానత్వం కోసం యువత చైతన్యంతో ముందుకు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు "ఓటు హక్కును గౌరవిస్తాం, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతాం, దేశ అభివృద్ధికి మా వంతు బాధ్యత నిర్వర్తిస్తాం" అంటూ ప్రతిజ్ఞ చేశారు. భవిష్యత్తులో ఓటర్లుగా మారబోయే విద్యార్థినుల్లో ఈ ప్రతిజ్ఞ ప్రజాస్వామ్య చైతన్యాన్ని పెంపొందిస్తుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రతి సంవత్సరం జనవరి 25న జరుపుకుంటారని, అయితే విద్యాశాఖ నుంచి వచ్చిన సర్క్యులర్ మేరకు ఈ కార్యక్రమాన్ని ముందుగానే నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## జమ్మికుంట 23వ వార్డులో ఇందిరమ్మ నూతన ఇల్లు భూమి పూజ



**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** జమ్మికుంట పట్టణంలోని 23వ వార్డులో రామణాతం ఇందిరమ్మ నూతన ఇల్లు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొనగంటి మల్లన్న పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ గృహ నిర్మాణ పథక లక్ష్యమని పేర్కొన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన అజెండాగా పనిచేస్తోందని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్‌తో పాటు సలీం, ఇమ్రాన్, పాతకాల ప్రవీణ్, రంజిత్ రెడ్డి, ప్రణయ్, శ్రీకాంత్ తదితర నాయకులు పాల్గొన్నారు. నూతన ఇల్లు నిర్మాణం చేపడుతున్న కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామీణపట్టణ ప్రాంతాల్లో పేదల జీవన ప్రమాణాలను మెరుగుపర్చే దిశగా ఉపయోగపడుతున్నాయని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు

# వసంత పంచమి రోజున విద్యార్థుల భవిష్యత్తుకు వెలుగు

**మోతుక్కులగూడెం ప్రభుత్వ పాఠశాలలో పిజెఆర్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**

**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** విద్య, విజ్ఞానానికి ప్రతీక అయిన వసంత పంచమి పర్వదినాన్ని అర్థవంతంగా మలుచుకుంటూ, మోతుక్కులగూడెం ప్రభుత్వ పాఠశాలలో పొనగంటి రవికుమార్ (పిజెఆర్) ఆధ్వర్యంలో ప్రశంసనీయమైన సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు అవసరమైన నోట్‌బుక్కులు, పెన్నులు, వివిధ రకాల స్టేషనరీ సామగ్రితో పాటు పౌష్టికాహారంగా ఫ్రూట్స్‌ను పంపిణీ చేశారు. విద్యే నిజమైన ఆయుధం పిజెఆర్ ఈ సందర్భంగా పొనగంటి రవికుమార్ (పిజెఆర్) మాట్లాడుతూ, “విద్యే సమాజాన్ని ముందుకు నడిపించే నిజమైన ఆయుధం. పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువులో వెనుకబడకూడదనే ఉద్దేశంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. విద్యార్థులు కష్టపడి చదివి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలి” అని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో ఉత్సాహం తల్లిదండ్రుల హర్షం పండుగ రోజు పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. అవసరమైన విద్యాసామగ్రి అందడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేయగా, తల్లిదండ్రులు పిజెఆర్ సేవా దృక్పథాన్ని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలను ఆదుకోవడం ద్వారా సమాజానికి మంచి సందేశం అందుతుందని పలువురు కొనియాడారు. వసంత పంచమి రోజున అర్థవంతమైన సేవ విద్య, విజ్ఞానానికి ప్రతీక అయిన వసంత పంచమి రోజున విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేయడం ఎంతో అర్థవంతమని స్థానికులు పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ఈ సేవా కార్యక్రమంలో ఆకుల పోశయ్య, పొనగంటి సతీష్, సిరియాల విజయ్, ఆకుల తిరుపతి, కడెం సురేష్, కడెం సతీష్, ఏ.బూసి అజయ్, ఆకుల వంశీ, పంజ రవి, బోనగిరి అరుణ్, బోనగిరి ఉదయ్, పచ్చిమట్ల భాను ప్రసాద్, బోనగిరి సాయిచరణ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమాజానికి ఆదర్శంగా పిజెఆర్ సేవా మార్గం పిజెఆర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని స్థానికులు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు





## జమ్మికుంట రాజకీయాల్లో కొత్త మలుపు

**బీజేపీలోకి అడువాల కుమార్ (శ్రీధర్) చేరిక**



**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** దశాబ్దకాలంగా స్వతంత్ర రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ, ప్రజాసేవలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న అడువాల కుమార్ (శ్రీధర్) భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో అధికారికంగా చేరారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ సమక్షంలో బీజేపీ కండువా కప్పుకుని పార్టీలోకి అడుగుపెట్టారు. ఈ పరిణామం జమ్మికుంట పట్టణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీసింది. సామాజిక సేవా నేపథ్యంతో రాజకీయాల్లోకి వచ్చిన అడువాల కుమార్ (శ్రీధర్) గత పదేళ్లుగా ఎలాంటి రాజకీయ పార్టీకి బహిరంగ మద్దతు ప్రకటించకుండా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించారు. ఇప్పుడు జాతీయ పార్టీతో తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించాలనే నిర్ణయం తీసుకోవడం విశేషంగా మారింది. ఈ సందర్భంగా ఎంపీ బండి సంజయ్ మాట్లాడుతూ, జమ్మికుంట ప్రాంతంలో ప్రజల మధ్య బలమైన పట్టున్న అడువాల కుమార్ (శ్రీధర్) బీజేపీలో చేరడం ఆనందకరమని తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన అనంతరం అడువాల కుమార్ (శ్రీధర్) మాట్లాడుతూ, దేశాభివృద్ధి, జాతీయ ఐక్యత, పారదర్శక పాలన వంటి అంశాల్లో బీజేపీకి ఉన్న స్పష్టమైన దృక్పథమే తనను ఆకర్షించిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి తనకు నమ్మకం కలిగించాయని చెప్పారు. ‘సబ్కా సాథ్, సబ్కా వికాస్’ సిద్ధాంతం మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. జమ్మికుంట పట్టణంలో అడువాల కుమార్ (శ్రీధర్) పేరు సామాజిక సేవకు పర్యాయపదంగా మారింది. పేదలకు సహాయం, విద్యార్థులకు మద్దతు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలపై చేపట్టిన పోరాటాలు ఆయనను ప్రజలకు మరింత దగ్గర చేశాయి. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యలపై రాజీ పడని ధోరణి ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. ఈ సందర్భంగా ఆయన రానున్న మున్సిపల్ ఎన్నికల్లో జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. తాను ఎన్నికైతే మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారం, రోడ్ల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తానని హామీ ఇచ్చారు. 28వ వార్డులో రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు, తాగునీటి కొరత వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వీటిని ప్రజల భాగస్వామ్యంతో పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. యువత కోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రాలు, మహిళల భద్రత, స్వయం ఉపాధి కార్యక్రమాల ప్రోత్సాహం తన అజెండాలో ముఖ్యమని పేర్కొన్నారు. అడువాల కుమార్ (శ్రీధర్) బీజేపీలో చేరిన నేపథ్యంలో జమ్మికుంటలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ప్రజల్లో నమ్మకం ఉన్న వ్యక్తి పార్టీలో చేరడం వల్ల బీజేపీకి స్థానికంగా బలం చేకూరే అవకాశం ఉందని అంటున్నారు. మొత్తానికి, అడువాల కుమార్ (శ్రీధర్) రాజకీయ జీవితంలో ఇది కీలక మలుపుగా మారింది. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఆయన పాత్ర, ప్రజల తీర్పు జమ్మికుంట రాజకీయ భవిష్యత్తును నిర్ణయించనుంది.

## జమ్మికుంట కేరళ పాఠశాలలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్:** జమ్మికుంట పట్టణంలోని కేరళ పాఠశాలలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యకు ప్రతీక అయిన సరస్వతీ దేవి పూజతో పాఠశాల ప్రాంగణమంతా భక్తి, విద్యా పరిమళంతో నిండిపోయింది. వసంత పంచమి సందర్భంగా నిర్వహించిన సరస్వతీ పూజలో ఉపాధ్యాయులు, విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. చదువుల తల్లి సరస్వతీ దేవిని అర్చిస్తూ విద్యార్థులు జ్ఞానకాంతులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కె.ఎస్. బెన్నీ సరస్వతీ దేవికి జ్యోతి ప్రజ్వలన చేసి, నూతన విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వసంత పంచమిని సరస్వతీ పూజగా కూడా పిలుస్తారని, ప్రతి సంవత్సరం మాఘమాసం శుక్ల పంచమి రోజున ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. విద్య కాంతిని లోకానికి ప్రసాదించిన మహత్తర పర్వదినం ఇదేనని, విద్యార్థులు విద్యతో పాటు విలువలను కూడా అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, విద్యార్థినులు సరస్వతీ వందనం, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వారి ప్రదర్శనల్లో భక్తి, క్రమశిక్షణ కనిపించింది. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు




## పాట ఆగిపోయిందా లేక కన్నీళ్లు మాటలయ్యాయా..

**తండ్రి లేని ఇంట్లో మౌనంగా మారిన మన్యం ప్రజల గొంతు**

**తండ్రి మరణం గుండెపోటు బాధ్యతల భారం**

**మౌనంలోకి వెళ్లిన మన్యం ప్రజా గాయకుడి జీవన పోరాటం**

**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం గంపరాయి గ్రామాని కి చెందిన దుడ్డు సత్యనారాయణ, గత కొన్నేళ్ళు గా ప్రజా గాయకుడిగా ప్రజా సంకల్ప పాద యాత్ర అల్లూరి సీతారామరాజు జిల్లా లో ప్రతి గ్రామానికి చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రజల గుండెల్లో చప్పుడు అయ్యారు. ప్రతి పేద వాడి సమస్య నాది అని ముందుకెళ్లారు. తన పాట దోపిడీ దారుల గుండెల్లో వణుకు, తన మాట అన్యాయాల వేట. ఆ గొంతుకి స్వార్థం లేదు, ఆ స్వరాన్ని డబ్బుకి అమ్ముకోలేదు,కేవలం పెట్టుబడి మాత్రమే. తన కలం నుండి జాలువారిన ప్రతీ అక్షరం మన్యం ప్రజల కష్టలకు నిలువెత్తు సాక్ష్యం.అన్యాయం కనిపిస్తే అవతల వ్యక్తి ఎంతటి వాడైనా ధైర్యం గా ప్రశ్నించే ఒంటరి గుండె. ఎన్నో రాజకీయ పార్టీల నుండి వచ్చిన సువర్ణ అవకాశాలు సైతం సున్నితంగా తిరస్కరించిన వ్యక్తిత్వం.వివరాల్లోకి వెళితే సరిగ్గా ఐదేళ్ల క్రితం గిరి గ్రామాల ఐక్యత కోసం, గ్రామ చైతన్య పాదయాత్ర తో వేసిన తన అడుగులలో చూసిన మన్యం ప్రజల కష్టాల సుడిగుండాలు తనను గాయకుడిగా మార్చింది. ప్రతీ సమస్య నేటికీ కొన్ని లక్షల రూపాయలు సొంత పెట్టుబడితో పాటల రూపంలో జనాలకు అందించి మన్యం ప్రజా గాయకుడిగా పేరుతెచ్చుకున్నారు.ఈ నిస్వార్థ ఒంటరి పోరాటం లోనే డాక్టరేట్ కూడా తీసుకున్న విషయం మనకు తెలిసిందే. గాయకుడి పాట అంటే, ఏదో ఒక మంచి మెసేజ్ అన్న ఆతృత జనాల్లో ఉండేది.అంతేకాదు కొన్ని సార్లు, పాటను రికార్డింగ్ చేసి అందించే ఆర్థిక స్థోమత లేనప్పుడు వాయిస్ మెసేజ్ రూపంలో చక్కగా వివరించడం అతని గత కొంత కాలం గా నిశ్శబ్దం లోకి వెళ్లిపోయారు. కారణం తన తండ్రి అనారోగ్యమనే చెప్పుకోవాలి.ఆపై తండ్రి ఆరోగ్యం విషమించడం, తనకు గుండెపోటు రావడం, కోలుకున్నాక తండ్రి మరణించడం. ఈ సంఘటలు గాయకుడిని తీవ్ర మానసిక ఒత్తిడికి గురించేసింది.ఈ ఒత్తిడి తోనే తన తండ్రి జ్ఞాపకాలు



నిత్యం నా తోనే ఉండాలని తండ్రి పేరునే తన పేరుగా మార్చుకొని మన్యం ప్రజా గాయకుడు డాక్టర్ దుడ్డు లక్ష్మయ్య గా అందరినీ అచ్చర్య పరిచారు. తండ్రి ఉన్నంతకాలం కుటుంబ భాధ్యత అంతా తండ్రి చూసేవారు. కానీ ఇప్పుడు కుటుంబ భారం అంతా గాయకుడి భుజాలపై పడింది. ఈ పరిస్థితుల్లో మళ్ళీ పాత గాయకుడిని చూడగలమా....?? అన్న ఆలోచన పలువురిలో వినిపిస్తున్న సందేహం. ఏది ఏమైనా గాయకుడి మనసు కుదుటపడి మళ్ళీ తనలో పూర్వ వైభవం చూడాలని ఆశిద్దాం. ఒక రోజు ఆ అడవుల్లో ఆ గొంతు మళ్లీ వినిపిస్తుందనే ఆశతో లేని ఇంట్లో, పాట పుట్టని గుండెలో బాధ్యతల బరువుతో వంగిపోయిన నిలిచుంది‘నాన్నాడ నేను మళ్లీ పాడనా?” అతని మౌనం బలహీనత కాదుడ అది ఒక కొడుకు కన్నీళ్లకు ఇచ్చిన గౌరవం.ఆ గొంతు నిశ్శబ్దమైందేమో కానీ,ఆ గుండె మాత్రం ఇంకా ప్రజల కోసమే కొట్టుకుంటోంది. ఏదో ఒక రోజు ఆ కన్నీళ్లే పాటలుగా మారతాయి ఆ మౌనమే ఘర్జనగా మారుతుందిడ ఆ రోజుమన్యం జిల్లా లో మళ్లీవింటాయితండ్రి పేరుతో పాడే ఒక కొడుకు గుండెచప్పుడు. అంతవరకూడఈ మౌనం కూడాఒక పోరాటమేనా........????

## జమ్మికుంటలో జనసేన రాజకీయ సమీకరణలు మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా బలోపేతం



**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు జనసేన పార్టీ అధిష్టానం ప్రకటించడంతో, రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేచింది. ఈ నేపథ్యంలో హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని జమ్మికుంట మున్సిపాలిటీలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో కీలక సమావేశం నిర్వహించారు. అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికల్లో జనసేన తరపున పోటీ చేయదలచిన అభ్యర్థుల నుంచి అధికారికంగా దరఖాస్తులను స్వీకరించారు. పార్టీ ఆశయాలు, విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే సత్తా ఉన్న అభ్యర్థులనే బరిలోకి దింపుతామని నాయకులు తెలిపారు. పవన్ కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గారి ఆశయాలు, సిద్ధాంతాలకు ఆకర్షితులై జమ్మికుంట పట్టణంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో జనసేనలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని సమావేశంలో వెల్లడించారు. ప్రజా సమస్యలపై నిబద్ధతతో పోరాడే పార్టీగా జనసేన ప్రజల్లో విశ్వాసం పొందుతోందని నాయకులు పేర్కొన్నారు. జమ్మికుంటలో బలమైన పోటీ ఈసారి జమ్మికుంట మున్సిపాలిటీలో జనసేన పార్టీ బలంగా ముందుకు సాగుతుందని, ప్రజల మద్దతుతో గణనీయమైన ఫలితాలు సాధిస్తుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలపై స్పష్టమైన కార్యాచరణతో ఎన్నికల బరిలోకి దిగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ జనసేన నాయకుడు భైరగోని అరవింద్ గౌడ్‌తో పాటు మంద వేణు, జంపాల పవన్, ఎలుకపెల్లి శివ, సాయి ప్రకాష్, శివ, రాకేష్ తదితరులు పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు

## సరస్వతి పుట్టినరోజు సందర్భంగా అంగన్వాడీ పిల్లలకు పలకల పంపిణీ

**కొరపల్లి గ్రామంలో ఆదర్శ కార్యక్రమం**



**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** సరస్వతి పుట్టినరోజు సందర్భంగా కొరపల్లి గ్రామానికి చెందిన పల్లె లవకుమార్‌విజయలక్ష్మి కుటుంబం గ్రామానికి ఆదర్శంగా నిలిచింది. వారి మనవడు నిదాన్ష్ చేతుల మీదుగా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు పలకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 11వ వార్డు మెంబర్ పల్లె నిఖిల పాల్గొని మాట్లాడారు. తమ కుమారుడిని కూడా ప్రభుత్వ అంగన్వాడీ కేంద్రంలోనే చేర్చుకుంటున్నట్లు ఆయన తెలిపారు. గ్రామంలోని చిన్నారుల భవిష్యత్తు కోసం ప్రైవేట్ ప్లే స్కూల్స్ వైపు మొగ్గు చూపకుండా, ప్రభుత్వ అంగన్వాడీ కేంద్రాలను ప్రతి తల్లిదండ్రులు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్న వయస్సులోనే ప్రాథమిక విద్యతో పాటు పోషకాహారం, మంచి అలవాట్లు, సంస్కారాలు అలవడతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీ కేంద్రాల ప్రాముఖ్యతను గుర్తించి ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమం గ్రామస్తులకు ఆదర్శంగా నిలిచిందని పలువురు ప్రశంసలు తెలిపారు. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు

## నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాం

**3వ వార్డు అభ్యర్థి కొలకాని రాజకుమారి రాజు**



**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జమ్మికుంట మున్సిపాలిటీ 3వ వార్డు బీజేపీ అభ్యర్థి కొలకాని రాజకుమారి రాజు ముందస్తుగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు గడపగడపకు తిరుగుతూ ప్రజలను కలుసుకొని తమను ఆదరించి ఆశీర్వదించి కౌన్సిలర్‌గా గెలిపించాలని కోరారు. అభివృద్ధియే తమ ప్రధాన ఎజెండా అని పేర్కొన్న రాజకుమారి రాజు, వార్డు ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ 24/7 సేవలందించే నాయకులను కౌన్సిలర్లుగా ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీని ఆదరించాలని ప్రజలను అభ్యర్థించారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో 3వ వార్డు తో పాటు జమ్మికుంట పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. జమ్మికుంట పట్టణాభివృద్ధికి ఇప్పటికే కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నిధులు మంజూరు చేశారని బీజేపీ జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కమలం పార్టీకి మద్దతు ఇచ్చి ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు.ప్రచారంలో భాగంగా రాజు దంపతులు ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించగా, ముందస్తుగానే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న 3వ వార్డు అభ్యర్థి కొలకాని రాజకుమారి రాజు విజయం సాధిస్తారనే ధీమాను బీజేపీ నేతలు, కార్యకర్తలు వ్యక్తం చేశారు

# ఉత్తరాంధ్ర అక్రిడేషన్ కమిటీ సభ్యులకు శిక్షణ తరగతులు

**అక్రిడేషన్ విధులుబాధ్యతలపై స్పష్టమైన అవగాహన**

**సామాన్యుడి అస్త్రం విశాఖపట్నంశీ :** ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (ఏపీ.ఎం.ఎఫ్) ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల అక్రిడేషన్ కమిటీ సభ్యులకు గురువారం శిక్షణ తరగతులు ఘనంగా నిర్వహించారు. ఏపీ.ఎం.ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. ఢిల్లీ బాబులు రెడ్డి ఆదేశాల మేరకు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం. లత అధ్యక్షతన, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కేశనపల్లి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. స్థానిక ఊర్వశి ఓల్డ్ ఐటీఐ జంక్షన్, ఎన్.హెచ్ ఫంక్షన్ హాల్ వేదికగా జరిగిన ఈ శిక్షణా కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్‌తో పాటు స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ యూనియన్ నుంచి జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులుగా ఎంపికైన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ.ఎం.ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం. లత మాట్లాడుతూ, అక్రిడేషన్ కమిటీ సభ్యుల విధులు, బాధ్యతలు, విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అక్రిడేషన్ కమిటీ సభ్యుడు అంటే ఎవరు? కమిటీలో సభ్యులు నిర్వహించాల్సిన బాధ్యతలు ఏమిటి? అనే అంశాలను అందరికీ అర్థమయ్యే రీతిలో వివరించారు. అక్రిడేషన్ మంజూరు ప్రక్రియ, తిరస్కరణకు దారితీసే పరిస్థితులు, జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీకి సంబంధించిన నియమ నిబంధనలు, అక్రిడేషన్ అక్రిడేషన్, మండల స్థాయి అక్రిడేషన్ మధ్య ఉన్న తేడాలపై స్పష్టతనిచ్చారు. తమ తమ జిల్లాల్లో అర్హులైన ప్రతి జర్నలిస్టుకి అక్రిడేషన్ అందేలా కృషి చేయాల్సిన బాధ్యత కమిటీ సభ్యులపై ఉందని ఆమె స్పష్టం చేశారు. అనంతరం ఏపీ.ఎం.ఎఫ్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కేశనపల్లి కిరణ్ కుమార్ మాట్లాడుతూ, చిన్న పత్రికలకు అక్రిడేషన్ మంజూరులో ఎదురవుతున్న సమస్యలు, అవి తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై విలువైన




సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి నుంచి యల్లపు సన్యాసి నాయుడు, నర్సీపట్నం నుంచి కె. రాజశేఖర్, పార్వతీపురం నుంచి జి. గోపాల్ రావు, అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి వి. అఖిల్,అలాగే విశాఖపట్నం ఏపీ.ఎం.ఎఫ్ కోర్ కమిటీ సభ్యులు రవి, ఎన్. శ్రీనివాస్, వి. ప్రసాద్ యాదవ్, వి. అర్జున్ కుమార్ పాల్గొని శిక్షణను విజయవంతం చేశారు.

# డోలీ మోతలో ఆదివాసి యువతి మృతి మజ్జివలససిల్లిపాకాని తారోడ్డు మంజూరు చేయాలి

**: ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్**

**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** రోడ్డు సదుపాయం లేక డోలీ మోతలో తరలిస్తుండగా ఆదివాసి యువతి ప్రాణాలు కోల్పోయిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. మజ్జివలస నుండి సిల్లిపాకాని వరకు తక్షణమే పక్కా తారోడ్డు మంజూరు చేయాలని, డోలీ మోతల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి ఆదివాసుల ప్రాణాలు కాపాడాలని ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్ చేసింది. తేది 21.01.2026న అల్లూరి జిల్లా హుకుంపేట మండలం బూర్జ పంచాయితీ సులిపకని గ్రామానికి చెందిన చిట్టం జ్యోతిని తీవ్ర అస్వస్థతకు గురికావడంతో డోలీ మోతలో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. రహదారి సదుపాయం లేకపోవడం, 108 అంబులెన్సు సకాలంలో రాకపోవడమే ఈ దుర్ఘటనకు కారణమని ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి టి. కృష్ణరావు తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కృష్ణరావు



గ్రామస్తులతో కలిసి ఐటిడిఏ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబులెన్సు కోసం రెండున్నర గంటలపాటు ఎదురు చూసినా స్పందన లేకపోవడంతో జ్యోతి ప్రాణాలు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మజ్జివలస ఎంఎల్‌హెచ్‌పి అధికారి జ్యోతిని మజ్జివలస వరకు తీసుకురావాలని పట్టు పట్టి, చివరకు ఆమె మృతి చెందినప్పటికీ కనీసం సంఘటన




స్థలానికి కూడా రాలేదని ఆరోపించారు. ఆ అధికారిపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అలాగే మజ్జివలస నుండి సిల్లిపాకాని గ్రామం వరకు పక్కా తారోడ్డు వెంటనే నిర్మించకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మజ్జి చంద్రన్న, బొండం జగ్గారావు, ఆర్. బాలన్న, బి. కామేష్, రాజారావు, టి. కామరాజు, నాన్నరావు తదితరులు పాల్గొన్నారు.

## చలి తీవ్రతతో గుండె పోటు ప్రమాదం... అవగాహన సదస్సులో మెడికవర్ వైద్యులు

**కోరుట్ల :** చలి తీవ్రతతో రక్తం చిక్కబడి, నరాలు కుంచించుకపోయి గుండెపై ఒత్తిడి పెరగడం కారణంగా గుండె పోటు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని మెడికవర్ వైద్యులు తెలిపారు. శుక్రవారం కోరుట్లలోని ఇస్తా హోటల్‌లో చలికాలం సీజన్‌లో వచ్చే గుండె జబ్బులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ... మిగతా సీజన్‌ల కంటే చలికాలంలో నీళ్లు తక్కువగా తాగడం వల్ల రక్తం చిక్కబడడం, ఆస్తమా, స్మోకింగ్ ఊపిరితిత్తుల దారులు మూసుకు పోవడం, ఆల్కహాల్ తీసుకోవడం కారణంగా గుండెపై ఒత్తిడి పెరుగుతుందన్నారు.


## అడ్డతీగల వైన్ షాపు నుండి విచ్చల విడిగా తరలింపు

**చంద్రబాబు నాయుడు ఆదేశాలు పక్కదారి**

**నిద్ర మత్తుతో రంపచోడవరం ఎక్సైజ్ శాఖ అధికారులు**

**నాటు సారా పైన కేసులు నమోదు బెల్టు షాపుల పైన తుత్ మంత్రం**

**సామాన్యుడి అస్త్రం అడ్డతీగ :** మండలంలో అడ్డతీగల లో ఉన్న వైన్ షాప్ నుంచి విచ్చలవిడిగా బెల్టు షాపులకు సంచులతో మద్యం సరఫరా అవుతుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పక్కాగా పల్లె గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించకూడదని ఎక్సైజ్ శాఖ అధికారులకి ఆదేశాలు జారీ చేసిన రంపచోడవరం ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం జీవో కి దిక్కరించి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని తెలుస్తుంది. నాటు సారా పైన సమాచారం ఇస్తే వెంటనే స్పందిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు వైన్ షాపుల నుంచి విచ్చలవిడిగా మద్యం చెంచులతో వెళ్తుంటే మాత్రం



నిద్రమత్తులో ఉంటున్నారు. తాత్కాలికమైన డమ్మీ కేసులు కట్టి చేతులు దులుపుకుంటున్నారు ఎక్సైజ్ శాఖ అధికారులు ఇప్పటికైనా సంబంధించిన శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారా లేదా అనేది మరో రెండు రోజుల్లో ప్రత్యేకమైన కథనంలో చూద్దాం

# జగిత్యాలలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

**సరస్వతి,లలితమాత,ధన్వనీతరి ఆలయాల్లో సరస్వతీ పూజలు**

**జగిత్యాల :** జగిత్యాల జిల్లాలో వసంతపంచమి సందర్భంగా ఆలయాలు భక్తులతో పోటెత్తాయి.ముఖ్యంగా సరస్వతి మాత కు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.జగిత్యాల స మీపంలోని నూకపల్లిలోనీ సరస్వతి ఆలయంలో అమ్మవారికి చిన్నారులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి, మాకు మంచి చదువులు ఆబ్బేలా దీవించాలని పుస్తకాలు పెట్టి మొక్కుకు న్నారు. పొలాస లలితమాత ఆలయంలో ఆలయ ఫౌండరి ట్రస్టీ చైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రాలకు కుంకుమ పూజలు చేశారు.లలితసాహస్ర నామ పారాయణం చేసి సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ సూర్య ధన్వాంతరి దేవాలయంలో వసంత పంచమినీ పురస్కరించుకొని శ్రీ సూర్య ఆంజనేయ స్వామి ఉపాలయానికి శుక్రవారం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ధనలక్ష్మి ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకము, తామర పువ్వులతో అమ్మ వారికి ధనలక్ష్మి యాగం, కుంకుమ పూజ అనంతరం లక్కి డ్రా తీసి ముగ్గురు మాతలకు చీరలు ఇచ్చారు.అలాగే గుట్ట రాజేశ్వర స్వామి సన్నిధిలో శివ పురాణ ప్రవచనం నాల్గవ రోజు బ్రహ్మశ్రీ బుర్రా భాస్కర్ శర్మ శివ పురాణం గురించి ఆసక్తికరంగా వివరించారు.ఈ కార్యక్రమములో ఫౌండరి చైర్మెన్ డాక్టర్ వడ్ల గట్ట రాజన్న, మేనేజింగ్ ట్రస్ట్ గట్టు రాజేందర్, ఆలయ ప్రెసిడెంట్ ముత్యాల రామలింగారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వోడ్నాల శ్రీనివాస్, చెల్లం



స్వరూప, మహేందర్, సత్తయ్య, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, రమేష్ రెడ్డి,తావుట్ రాంచంద్రం, ఉటూరి కళ్యాణి, ఉటూరి హరీష్, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి వడ్ల గట్ట శంకర్, కోశాధికారి వడ్లగట్ట స్వాతి, సహాయ కోశాధికారి వడ్లగట్ట గోపి, ధర్మకర్తలు వొడ్నాల లత, భారతాల గీత, సభ్యులు జయ శ్రీ, సుజాత, శ్రీ నిజ, రంగ స్వప్న,పాంపట్టి సులోచన, వనజ, ఉటూరి అర్చన, శైలజ, జంగిలి విజయ,రజిత, ప్రసన్న, హర్షిణి, జమున,భాగ్య లక్ష్మి,తిరుపతి, అర్చకులు గుంటి జగదీశ్వర్, అజయ్ శర్మ, ప్రణయ్ కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిడదవోలు పట్టణ బీసీ సంఘ ఉపాధ్యక్షులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు

**సామాన్యుడి అస్త్రం నిడదవోలు:** బిసి సంఘ ఉపాధ్యక్షులు, 6వ వార్డు ప్రధాన కార్యదర్శి దేవగల్ల సాయిరాం జన్మదినం సందర్భంగా పట్టణంలో సాయిరాం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పట్టణ జనసేన నాయకులు 10వ వార్డు ఇంచార్జ్ నాగబోయిన నాగరాజు పాల్గొన్నారు ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ నేను ఈ స్థాయిలో ఉండడానికి కారణం



కుటమి ప్రభుత్వం. కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటానని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లోనే నడుస్తానని తెలిపారు. జన్మదిన వేడుకలు తెలిపిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదములు తెలుపుతూ ఎల్లప్పుడూ ప్రజా సేవలో తోడుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేక సురేంద్ర, మదన గోపాల స్వామి స్వాములు నాగ సురేష్,గణేష్ , గుప్తా స్వామి,కట్టా మణికంఠ, గంట అవినాష్, వీరమల్ల వెంకట సాయి, పట్టణ నాయకులు,పలువురు పాల్గొన్నారు.

## రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో లోకేష్ జన్మదిన వేడుకలు కేక్ కటింగ్, చీరల పంపిణీ, మెడికల్ క్యాంప్, అన్నదాన వితరణ



**సామాన్యుడి అస్త్రం : అల్లూరి** అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకు నియోజకవర్గం, హుకుంపేట మండలం, మత్యపురం పంచాయతి, ఉప్ప గ్రామంలో నారా లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్థులతో కలిసి కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు చీరల పంపిణీ, మెడికల్ క్యాంప్ నిర్వహణ, అంగన్వాడీ కేంద్రం ద్వారా సీమంతం కార్యక్రమం, గ్రామ ప్రజలకు అన్నదాన వితరణ చేపట్టారు. లోకేష్ జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా ప్రజాసేవా పర్వంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సాగిన ఈ కార్యక్రమాలు గిరిజన ప్రాంత ప్రజల నుంచి విశేష ఆదరణ పొందాయి. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు లోకేష్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు, రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ సాగర సుబ్బారావు, దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, అండీభ సర్పంచ్ తామర్ల సత్యనారాయణ, శోభకోట సర్పంచ్ పలాసి శశిభూషణం నాయుడు, బూర్జ సర్పంచ్ బొంజుబాబు, హుకుంపేట ఎంపీటీసీ కొమ్మ రమ, గిన్నెలకోట ఎంపీటీసీ గడుతురి నిర్మల, మండల పీఏసీఎస్ డైరెక్టర్ కోటేశ్వరావు పడాల్, గూడ మాజీ ఎంపీటీసీ కంబిడి రాంబాబు, అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మండ్యాగురు స్వామి, పీసా మండల అధ్యక్షులు చప్పాలి శంకర్ రావు, ఉప్ప మాజీ సర్పంచ్ చందన పాత్రుడు, మాజీ ఎంపీటీసీ దేముడు, రాప వైస్ సర్పంచ్ గంజాయి మోహన్ రావు, ఉప్ప మాజీ సర్పంచ్ నర్సింగరావు, మాజీ సర్పంచ్ పెల్లమల రామలింగం, అనంతగిరి మండల ప్రధాన కార్యదర్శి నరేంద్ర, మాజీ ఎంపీటీసీ దూరియా నూకరాజు, అరకు పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పెనుమాల నిర్మల, పెదబయలు మండల మహిళా ప్రధాన కార్యదర్శి కిముడు మహేశ్వరీ, అరకు పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నెగెలా సుందర్ రావు, చిన్నలాబుడు మాజీ సర్పంచ్ వంతల పూర్ణ, కుమడ మాజీ సర్పంచ్ కూడ వెంకటరావు, మత్యపురం వార్డు మెంబర్ నూకాలమ్మ, బీజేపీ నాయకుడు గంజాయి గంగరాజు, జనసేన నాయకులు సురకత్తి రాంబాబు, రాంబాబు దొర, టీడీపీ యువ నాయకులు బిడ్డ లక్ష్మణ్, బిడ్డ దేముడు, చట్టు అప్పలరాజు, దణ్ణయికి రమేష్, ఉబ్బటి అశోక్ కుమార్, సురకత్తి జాన్, కర్జా అచ్చిబాబు, త్రినాధ్, పండు, మురళి, ఉబ్బటి శివ సాగర్, జంపారంగి తిరుపతిరావు, కొమ్మ పృథ్విరాజు, కొర్ర తాంగుల మహేష్, రాజు, బాకా సుబ్బారావు, బెసు, రాబరికి వంశీ, గంపరాయి మల్లేష్, రవికుమార్, అంటిపర్త రవీంద్ర, సోనారి కామేష్, హరిబారికి నర్సయ్య, బంటు శివ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల దాహార్తికి శాశ్వత పరిష్కారం

**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన చేతిపంపు బోరు ప్రారంభం -అరకు వ్యాలీ జడ్పీటీసీ శెట్టి రోహిణి**

**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీ మండల కేంద్ర పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో



ఉంచుకుని కళాశాల ప్రాంగణంలో నూతన చేతిపంపు బోరు ఏర్పాటు చేసి ప్రారంభించారు. కళాశాలలో నీటి సమస్య ఉందని లెక్చరర్లు, విద్యార్థులు జడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి దృష్టికి తీసుకురావడంతో, ఆమె వెంటనే స్పందించారు. 15వ ఆర్థిక సంఘం జడ్పీ నిధుల నుంచి రూ.1,50,000 వ్యయంతో నూతన చేతిపంపు మంచినీటి బోరు ఏర్పాటు చేయించారు. ఈ బోరును వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగం చాణక్యతో కలిసి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాగునీటి కొరత కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించినందుకు కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు జడ్పీటీసీ సభ్యురాలికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారం చూపడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు కమ్మిడి అశోక్, డిఐఈఓ ఎస్. భీమశంకర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డిపిజె కుమార్, వైసీపీ అరకు వ్యాలీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్, మయూరి రాజు, కళాశాల లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

# పి.వి.కాలనీ సింగరేణి హైస్కూల్లో రూ.13 లక్షల వ్యయంతో ఆధునికరించిన డైనింగ్ హాల్ ప్రారంభించిన ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్

**సామాన్యుడి అస్త్రం మణుగూరు :** మణుగూరు ఏరియా పరిధిలోని పి.వి. కాలనీ సింగరేణి హైస్కూల్లో సుమారు రూ.13 లక్షల వ్యయంతో ఆధునికరించిన డైనింగ్ హాల్ (భోజనశాల) ను ఈ రోజు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ముఖ్య అతిధిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మాట్లాడుతూ.... విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో సింగరేణి యాజమాన్యం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు ఎండలో, వానలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా సౌకర్యవంతంగా భోజనం చేయాలనే సదుద్దేశంతో ఈ డైనింగ్ హాల్ను ఆధునికరించి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. విద్యార్థులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శాస్త్ర, సాంకేతికంగా ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్న మన దేశాన్ని భవిష్యత్తు కాలంలో సమర్థవంతంగా సారధ్యం వహించాలంటే రేపటి భారతావనికి రథ సారధులైన నేటి బాలలు సెల్ ఫోన్లు, ఇతర వ్యాపకాలతో కాలాన్ని వృధా చేసుకోకుండా శ్రద్ధగా చదువాలి. గొప్పగా ఎదుగాలి. మీ అందరి ఉజ్వల భవిష్యత్తుకై కార్పొరేట్ విద్యా సంస్థలకు తీసుకొని రీతిలో ఉత్తమ ప్రమాణాలతో, సకల సౌకర్యాలతో ఉత్తమ విద్యను అందిస్తూ నూరు శాతం ఫలితాలు సాధిస్తున్న సింగరేణి పాఠశాలకు మరింత మంచి పేరు తేవాలని విద్యార్థిని, విద్యార్థులందరికి సూచించారు. అలాగే ఈ సంవత్సరంలో పదవ తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థిని విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం బి. శ్రీనివాస చారి, డిజిఎం (పర్సనల్) ఎస్. రమేష్, డిజిఎం (సివిల్) శివ ప్రసాద్, గుర్తింపు సంఘాల బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణం రాజు, క్వాలిటీ విభాగం హెచ్ ఓడి నాగరమేష్, ఏరియా సర్వే అధికారి ఎల్. దయాకర్, సీనియర్ ఎస్టేట్స్ అధికారి స్వప్న, ఫైనాన్స్ మేనేజర్ పి. రమేష్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ డి.వి.ఎస్.ఎన్. ప్రవీణ్ మరియు సింగరేణి పాఠశాల జీఎం ఆర్. కళ్యాణి పాల్గొన్నారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు,




ఉపాధ్యాయ బృందం, ఇతర సింగరేణి అధికారులు, మరియు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

## నర్సాపురంలో మూడోవ రోజు సమ్మక్క సారలమ్మ జాతర

ఘన స్వాగతం పలికిన సర్పంచ్ సంగం చినరాజు లక్ష్మీ కుమారి దంపతులు



**సామాన్యుడి అస్త్రం ఖమ్మం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలోని పడమట నరసాపురం గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ సంగం చినరాజు లక్ష్మీ కుమారి దంపతులు పడమట నరసాపురం గ్రామపంచాయతీ శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ కమిటీ చైర్మన్ లేళ్ళ అప్పి రెడ్డి, ఆదివాసి జాతి అడవి బిడ్డలైనటువంటి సమ్మక్క సారలమ్మలను దర్శించుకుని సారే సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెల్లబోయిన మల్లికార్జునరావు, వెలగా రాంబాబు, వెలగా తిరుపతిరావు, సంఘం నాగరాజు, పుప్పాల శ్రీను, లేళ్ళ నవీన్ రెడ్డి , తెల్లబోయిన నరసింహారావు, దారబోయిన రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ క్యాంపులో ఉత్తమ సేవలు అందించిన మీసేవ ఇర్ప కిషోర్



**సామాన్యుడి అస్త్రం గుండాల :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన ఆధార్ క్యాంపులో ఉత్తమ సేవలు అందించిన మీసేవ నిర్వాహకులకు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం తన చాంబర్లో ప్రశంసాపత్రాల అందజేశారు. ఉత్తమ సేవలందించినందుకు వారిని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని కలెక్టర్ ఆకాంక్షించారు, గుండాల మండలనికి చెందిన ఇర్ప కిషోర్ కి ఆధార్ క్యాంపులో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ప్రశంషా పత్రం తీసుకోవటం గర్వకారణం అన్నారు.

## నేటి తో ముగిసిన సర్పంచుల శిక్షణ



**సామాన్యుడి అస్త్రం గుండాల:**దగుండాల మండల సర్పంచు శుక్రవారం తో శిక్షణ పూర్తి చేసుకొని గ్రామ పరిపాలనలో కీలకమైన సర్పంచులకు రాష్ట్ర ప్రభుత్వం 5 రోజుల పాటి శిక్షణ నిర్వహించింది. ఇటీ వల 2025 సంవత్సరంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులకు పల్లెపాలన, పంచాయతీరాజ్ చట్టం తదితర అంశాలపై తర్ఫీదు ఇచ్చారు, గుండాల మండలం లో గెలుపొంది 11 మంది సర్పంచులకు సోమవారం నుంచి శు క్రవారం వరకు హెర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ప్రాంగణంలో శిక్షణ తరగతులు ప్రారంభించారు. సర్పంచులు ఐదు రోజుల పాటు ఉండేందుకు భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. . పల్లె పాలనలో సర్పంచుల పాత్రపై. ప్రజలకు జవాబుదారీగా వ్యవహరిస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు సర్పంచులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుండాల సర్పంచ్ కోరం సీతారాముల, రోళ్లగడ్డ సర్పంచ్ భుక్య మంగమ్మ, దామరతొగు సర్పంచ్ కల్తీ కృష్ణరావు, సాయనపల్లి సర్పంచ్ కృష్ణవేణి, కాచనపల్లి సర్పంచ్ జర్పుల కిషన్,, పడుగోనిగూడెం సర్పంచ్ సంజీవరావు,శంబునిగూడెం సర్పంచ్ సుమలత, శెట్టుపల్లి సర్పంచ్ వసంతరావు, లింగగూడెం సర్పంచ్ వెంకటేశ్వర్లు, మామకన్ను సర్పంచ్ కల్తీ రజిత, ముత్తపురం సర్పంచ్ కల్తీ రాధ పాల్గొన్నారు.

# ఆదివాసి సంక్షేమ పరిషత్ పత్రికా ప్రకటన

మణుగూరు డివిజన్ స్థాయి సమావేశంలో కరకగూడెం మండల నూతన కమిటీ ఎన్నిక



**సామాన్యుడి అస్త్రం మణుగూరు:** ది. 23/09/2026 శుక్రవారం నాడు, కరకాగూడెం మండలం రాళ్లవాగు పెద్దమ్మతల్లి గుడి వద్ద , మణుగూరు డివిజన్ అధ్యక్షులు సోలం హరి శంకర్ అధ్యక్షతన డివిజన్ స్థాయి జరిగిన సమావేశంలో రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తాటి వెంకటేశ్వర్లు గారు మరియు జిల్లా అధ్యక్షులు వాగుబోయిన చంద్రయ్య దోర గారు పాల్గొని మాట్లాడటం జరిగింది. ఈ సమావేశం ఉద్దేశించి మాట్లాడుతూ మణుగూరు డివిజన్ పరిధిలో ఉన్న మండలాలలో వన్ 1/70 చట్టం రోజురోజుకు నీరుగారిపోతుంది . చట్టాన్ని అమలు పరచడంలో అధికారులు నిర్లక్ష్యం ధోరణి వహిస్తున్నారు. లంబాడాలను ఎస్టి జాబితా నుండి తొలగించాలని సంఘం ఏర్పడ్డ నాటి నుండి నేటి వరకు ఆదివాసి సంక్షేమ పరిషత్ ఉద్యమం చేస్తూనే ఉంది. ఇందులో భాగంగా 2011 సంవత్సరంలో హైకోర్టులో లంబాడీలును తొలగించాలని కేసు వేయడం జరిగింది. అలాగే ఫిబ్రవరి నెలలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలలో గెలుపొందిన ఆదివాసి సర్పంచులను ఉపసర్పంచులను ఆదివాసి సంక్షేమ పరిషత్ & అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చేపట్టబోతుంది. ఈ సందర్భంగా ఈ సమావేశంలో కరకగూడెం మండలం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షులుగా చందా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి తొలెం రామారావు, ఉపాధ్యక్షులుగా ఈసం సత్యనారాయణ, కోశాధికారి ఆరెం కృష్ణమూర్తి, కార్యదర్శులుగా గొగ్గల నారాయణ, కోరం రవీందర్, చంద గణేష్, లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి సోలం రామారావు గారు కార్యదర్శిలు ఈసం సూర్య బాబూ, వాగుబోయిన శ్రీను, డివిజన్ ఉప అధ్యక్షులు సోలం వెంకట రమణ, మణుగూరు మండల అధ్యక్షులు మడి రమేష్, పినపాక మండల అధ్యక్షులు పడిగా అశోక్, మణుగూరు మండల ఉప అధ్యక్షులు కోండ్రు నాగేందర్, ప్రధాన కార్యదర్శి మడకం ప్రసాద్, కార్యదర్శి గోగ్గాల కోటేశ్ మరియు అభ్యుదయ సంఘం నాయకులు పాల్గొనడం జరిగింది.

## విజయ వంతంగా పూర్తి చేసిన సర్పంచుల శిక్షణ తరగతులు

ఖి ఐదు రోజుల శిక్షణ తరగతులు పూర్తి చేసిన మణుగూరు మండల సర్పంచులు

ఖి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతుల సర్టిఫికెట్స్ అందుకున్న మణుగూరు సర్పంచులు




**సామాన్యుడి అస్త్రం మణుగూరు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సర్పంచుల శిక్షణ తరగతులు (19-01-2026) నుండి (23-01-2026) వరకు నిర్వహించడమైనది. ఈ సందర్భంగా మణుగూరు మండలంలోని సర్పంచులు ఈ ఐదు రోజుల శిక్షణ తరగతులు విజయ వంతంగా పూర్తి చేసుకొని జిల్లా అధికారుల యంత్రాంగం చేత సర్పంచుల గుర్తింపు సర్టిఫికేట్స్ పొందడం జరిగింది. ఈ యొక్క శిక్షణ తరగతుల్లో పంచాయితీ రాజ్ 2018 చట్టం ప్రకారం అంశాలు ఏమిటి, నిబద్ధనలు ఏమిటి, నియమాలు ఏమిటి, విధి విధానాలు ఏమిటి, గ్రామ పంచాయితీ పరిపాలన ఏమిటనేది ఎలా ఉంటాయి అనేదాని గురించి ఎంతో చక్కగా శిక్షణ లో వివరించారు. గ్రామ పంచాయితీ కి రాష్ట్ర ప్రభుత్వ నిధులు, కేంద్ర ప్రభుత్వ నిధులు ఏ విధంగా వస్తాయో.. వాటిని ఎలా గ్రామాభివృద్ధికి ఉపయోగించుకోవాలి అనేవి, నూతన చట్టాలపై అవగాహన కలిపిస్తూ.. సమగ్ర సుపరిపాలన గురించి శిక్షణ లో నేర్పడం జరిగింది. ఈ యొక్క శిక్షణ భాగంలో భోజనాలు, నివాస వసతులు ఎంతో అద్భుతంగా ఏర్పాట్లు చేశారు. సర్పంచులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సంబంధిత జిల్లా అధికారులు.. మండల స్థాయి అధికారులు.. పంచాయితీ సెక్రటరీలు తదితర అధికారులంతా పూర్తి స్థాయిలో విధులు నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణలో మణుగూరు మండల స్థాయి సర్పంచులు 100 కు 100% హాజరవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల స్థాయి సర్పంచులు కలబోయిన, మాధవరావు, పాల్వంచ రాములు, పూనెం రమేష్, కుంజ శ్రావణ్ కుమార్, జగిడి ప్రసాద్, మడకం క్రిష్ణ, ఎన్నిక స్వేత, కొమరం జంపేశ్వరి, కాలం కల్పన, పాయం చిట్టమ్మ, చిడెం ఉషారాణి, మడి స్వరూప, కారం పూజిత, శెట్టిపల్లి మాధవి, పాల్గనడం జరిగింది.

## జూబ్లీహిల్స్ లో విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్స్..

షాద్ నగర్ వ్యాపారి పలబట్ల సతీష్ ఆధ్వర్యంలో ప్రారంభం

హాజరైన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి

ప్రత్యేక ఆకర్షణగా సినీ నటి ఐశ్వర్య రాజేష్



**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :**షాద్ నగర్ తో మొదలుపెట్టి పలుచోట్ల తన వ్యాపారాలను విస్తరింపజేస్తున్న పట్టణ వ్యాపారి పలుబట్ల సతీష్ కుమార్ జూబ్లీహిల్స్ లో చెక్ పోస్ట్ వద్ద విశిష్ట గోల్డెన్ డైమండ్స్ వ్యాపార సంస్థను శుక్రవారం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కాగా, ప్రముఖ సినీ నటి ఐశ్వర్య రాజేష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ షాద్ నగర్ వ్యాపారులు రాష్ట్రవ్యాప్తంగా తమ వ్యాపారాలను విస్తరింప చేయడం సంతోషకరంగా ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా సినీనటి ఐశ్వర్య రాజేష్ వ్యాపార సంస్థను ప్రారంభించి ఈ వ్యాపారం ఉన్నతికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వ్యాపారులు పలవట్ల సతీష్ కుమార్, వలబట్ల శివకుమార్, ఆనంద్ కుమార్ మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డిని శాలువాలతో సత్కరించారు. వినియోగదారులకు నాణ్యమైన బంగారం వజ్రాభరణాలు అందుబాటులోకి రానున్నయని ఈ సందర్భంగా నిర్వాహకులు వెల్లడించారు..

# షాద్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా మెగా టీచర్ పేరెంట్ మీటింగ్..




**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాల షాద్ నగర్ లో ఘనంగా పేరెంట్ టీచర్ సమావేశం కళాశాల ప్రిన్సిపల్ సర్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో అత్యంత విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా జూనియర్ కళాశాలకు ఈ కళాశాల పూర్వ విద్యార్థి అయిన షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారం మరువలేదని ఎవరు చేయలేరని కొనియాడిన ప్రిన్సిపల్ సర్వేశ్వర్ రెడ్డి. ఈ కళాశాల చదివిన విద్యార్థి ఎమ్మెల్యేగా ఉన్నందుకు ఈ కళాశాలకు ఎంతో గర్వకారణం అని పేర్కొన్నారు. అలాగే ఇంకో పూరి విద్యార్థి డాక్టర్ సామ రవీందర్ రెడ్డి సివిల్ సర్వీస్ స్థాయి వాళ్లకు పుస్తకాలు రాసే స్థాయిలో ఉన్నందుకు ఈ కళాశాలకు గర్వకారణం అని తెలిపారు. మేమందరము ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకొని ఉన్నత స్థానంలోకి వచ్చిన వాళ్ళమే షాద్నగర్ ఎమ్మార్వో నాగయ్య.. పేరెంట్స్ మీ పిల్లలను రోజూ పరిశీలించండి డి .ఐ. ఈ .వో వెంక్యా నాయక్. ప్రభుత్వ కళాశాలపై నమ్మకం ఉంచండి మీ నమ్మకాన్ని వమ్ము చేయము కళాశాల ప్రిన్సిపల్ సర్వేశ్వర్ రెడ్డి.. మీకున్న సమస్యలన్నింటికీ ఏకైక పరిష్కారం చదువు ఒక్కటే. జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి ప్రస్తుత అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్ రెడ్డి.. తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం లో భాగంగా ఈరోజు ఉదయం షాద్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రాండ్ మెగా టీచర్ పేరెంట్ ఈ మీటింగ్ చాలామంది విద్యార్థులు తల్లిదండ్రులు హాజరయ్యారు. అలాగే ఈ పేరెంట్ టీచర్ మీటింగ్ ను ఉద్దేశించి షాద్ నగర్ ఎమ్మార్వో నాగయ్య మాట్లాడుతూ ఇప్పుడు మేము అందరం ప్రభుత్వ పాఠశాలలను చదువుకొని ఉద్యోగాలు సాధించిన వాళ్ళమే కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాలయాలు చదువుకుంటే లైఫ్ స్కిల్స్ బాగా నేర్చుకోవచ్చని తన అనుభవాలను చెప్పారు. ఇంటర్ విద్యా డి ఐ ఈ ఓ వెంక్యా నాయక్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో అత్యాధునికమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని అధ్యాపక ఖాళీలు లేకుండా చూస్తున్నామని ఇంకా నాణ్యమైన విద్యను అందించడానికి ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.. కళాశాల ప్రిన్సిపల్ సర్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ లాస్ట్ ఇయర్ కు ఈ సంవత్సరానికి అద్భుతమైనటువంటి అడ్మిషన్లు జరిగాయి అదే విధంగా 95% పైగా మార్కులు తెచ్చుకునే విద్యార్థుల సంఖ్య కూడా మా దగ్గర పెరిగింది . వచ్చే సంవత్సరం ఇంకా నూతన మార్పులు ప్రవేశపెట్టి విద్యార్థులకు ఇంకా నాణ్యమైన విద్యను అందిస్తామని చెప్పడం జరిగింది. ఈ కళాశాలకు స్థానిక ఎమ్మెల్యే శ్రీ వీర్లపల్లి శంకర్ గారి సహకారం మరువలేని రాష్ట్రంలోనే ఏ ఎమ్మెల్యే చేయని విధంగా ఈ కళాశాలను తీర్చిదిద్దుతున్నారని సభలో అభినందించారు. ఈ కళాశాల విద్యార్థిగా సివిల్ సర్వీస్ (గ్రూప్స్ వారికి పుస్తకాలు రాసిన రవీందర్ రెడ్డి ఇటీవల రాసిన ఇండియన్ ఎకానమీ పుస్తకాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారని తెలుపుతూ అలాంటివారు ఈ కళాశాల పూర్వ విద్యార్థులు కావడం చాలా సంతోషకరమని అంటూ అభినందించాడు. ఇంతకన్నా గొప్పగా మీరు ఎదగాలని కళాశాల విద్యార్థులకు వివరించాడు . జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత అర్థశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ మీకు ఏ సమస్య ఉన్నా దానికి చదువే పరిష్కారం అని, అలాగే మీరు ఎంచుకున్నటువంటి స్నేహితులు అత్యంత మంచి వారై ఉండాలని, పేరెంట్స్ మాట వినాలని, మీకు మీరే సొంతంగా జీవితం గురించి అవగాహన కలిగి ఉండాలని ఆ టెంపో ను జీవితంలో స్థిరపడేంతవరకు కొనసాగించాలని చెప్పడం జరిగింది. అధ్యాపకులతో పెద్దవాళ్లతో మంచి సంబంధాలు ఎల్లప్పుడూ కలిగి ఉండాలని తెలపడం జరిగింది. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ మా విద్యార్థులకు 95% పైగా మార్కులు వచ్చినందుకు మాకు చాలా ఆనందంగా ఉంది ఇక్కడ ప్రిన్సిపాల్ సర్వేశ్వర్ రెడ్డి గారు ఇతర అధ్యాపకులు రెస్పాన్స్ చాలా మంచిగా ఇస్తారని ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. మా పిల్లలకు ఇలాగే మీ సహకారం ఎల్లప్పుడూ ఉండాలని పేరెంట్స్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫరూఖ్ నగర్ మండల ఎంఈఓ మనోహర్ గారు,పూలే డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రీతి, ఫరూక్ నగర్ బాయ్స్ హై స్కూల్ హెడ్మాస్టర్ రాజశేఖర్ రెడ్డి, గర్ల్స్ హై స్కూల్ హెడ్ మాస్టర్ పద్మ కుంట హై స్కూల్ నుండి రాంచందర్, అమ్మ ఆదర్శ పాఠశాల నుండి సరిత,విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు అధ్యాపకులు పాల్గొన్నారు..

## రేపల్లెవాడ గ్రామపంచాయతీలో నూతన నర్సరీ ప్రారంభోత్సవం

రేపల్లె వాడలో ఉపాధి హామీ నర్సరీ పనుల ప్రారంభం

సర్పంచ్ అజ్మీర సురేష్ నాయక్



**సామాన్యుడి అస్త్రం ఖమ్మం :** ఏన్కూరు మండలం రేపల్లెవాడ గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వివిధ అభివృద్ధి పనులతో పాటు, నర్సరీ పనులను సర్పంచ్ అజ్మీర సురేష్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అజ్మీర సురేష్ నాయక్ మాట్లాడారు. గ్రామీణ ఉపాధి అవకాశాలు పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాభివృద్ధి లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో అర్హులైన వారికి పని కల్పించడంతో పాటు గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతామని పేర్కొన్నారు. అలాగే గ్రామంలో అవసరమైన మొక్కలను స్థానికంగానే పెంచే ఉద్దేశంతో నర్సరీ ఏర్పాటు చేయడం వల్ల హరితాభివృద్ధికి బలమైన పునాది పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్ ఫీల్డ్ అసిస్టెంట్ భూక్య నరసింహారావు గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.




## నేతాజీకి నివాళులర్పించిన 'డేవిడ్ రెడ్డి' చిత్ర బృందం!

మంచు మనోజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'డేవిడ్ రెడ్డి' నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వెలువడింది. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని చిత్ర బృందం ఆయనకు నేడు ఘనంగా నివాళులు అర్పించింది. దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా నేతాజీ ఆశయాలకు అనుగుణంగా ఉంటుందని, అందుకే ఆయన స్ఫూర్తిని చాటనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రం 1897 నుంచి 1922 మధ్య కాలంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. బ్రిటిష్ వారిపై పోరాటం చేసిన భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్ వంటి వీరుల తరహాలోనే 'డేవిడ్ రెడ్డి' అనే యోధుడు దేశం కోసం ఎలా పోరాడాడు అనే అంశాన్ని దర్శకుడు హనుమరెడ్డి యక్కంటి చాలా పవర్‌ఫుల్‌గా తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'వార్ డాగ్' గ్లింప్స్‌లో వినిపించిన సంభాషణలు, మంచు మనోజ్ మేకోవర్ ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచాయి. ఈ సినిమాకు కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా, ఉజ్వల్ కులకర్ణి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. మంచు మనోజ్ తన సెకండ్ ఇన్నింగ్స్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలోనే రానున్నాయి.



## 'భర్తపై భార్య తిరగబడితే..'.. ఆసక్తిగా ట్రైలర్

తరుణ్ భాస్కర్, ఈషారెబ్బా జంటగా వస్తోన్న తాజా చిత్రం ఓం శాంతి శాంతి శాంతిః. ఈ సినిమాకు ఎ.ఆర్ సజీవ్ దర్శకత్వం వహించారు. జయ జయ జయహే అనే మలయాళ చిత్రానికి రీమేక్‌గా ఈ మూవీని రూపొందించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ చిత్రం థియేటర్లలో సందడి చేసేందుకు వచ్చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఓం శాంతి శాంతి శాంతిః మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ చేతుల మీదుగా ట్రైలర్ విడుదల చేశారు. ఈ మూవీ ట్రైలర్ చూస్తుంటే భార్య, భర్తల మధ్య జరిగే ఫ్యామిలీ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌లా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. కామెడీ సీన్స్ అలరిస్తున్నాయి. భార్యపై భర్త డామినేషన్ చేయడం.. ఆ తర్వాత జరిగే సీన్స్ ఈ సినిమాపై ఆసక్తి మరింత పెంచుతున్నాయి. ఈ చిత్రం జనవరి 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇంకెందుకు ఆలస్యం ట్రైలర్ చూసేయండి.




## ఆ సీన్ సరదాగా చేశాం.. దయచేసి దానిని ఎవరు చేయోద్దంటూ అనిల్ రిక్వెస్ట్


మెగాస్టార్ చిరంజీవి డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో తెరకెక్కిన సంక్రాంతి స్పెషల్ చిత్రం 'మన శంకర వర ప్రసాద్ గారు' బాక్సాఫీస్ వద్ద సూపర్ డూపర్ హిట్‌గా దూసుకుపోతోంది. జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా, మొదటి రోజు నుంచే హౌస్‌ఫుల్ షోస్‌తో రికార్డ్ స్థాయి వసూళ్లను నమోదు చేస్తూ ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో మెరిసిన ఈ చిత్రంలో నయనతార కథానాయికగా నటించారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించిన ఈ సినిమాను శ్రీమతి అర్చన సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో దర్శకుడు అనిల్ రావిపూడి సినిమా విజయం వెనుక ఉన్న అనుభూతులు, చిరంజీవితో పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. సినిమాను చూసి పవన్ కళ్యాణ్ అభినందించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని అనిల్ తెలిపారు. పవన్ కళ్యాణ్ గారు మాత్రమే కాదు, ఇండస్ట్రీలోని పలువురు దర్శకులు, హీరోలు వ్యక్తిగతంగా ఫోన్ చేసి, మెసేజెస్ పంపారు. ఈ విజయం కేవలం మా టీమ్‌ది మాత్రమే కాదుడ ఇండస్ట్రీ మొత్తం కలిసి సెలబ్రేట్ చేసిన ఫీలింగ్ కలిగింది" అని చెప్పారు. చిరంజీవి లుక్ గురించి మాట్లాడుతూ .. ఫస్ట్ ఫోటోషూట్‌లోనే చిరంజీవి గారి లుక్ చూసి స్టన్నింగ్ అనిపించింది. గ్లామర్, ఫిట్‌నెస్, బాడీ లాంగ్వేజ్ అన్నీ పర్ఫెక్ట్‌గా కుదిరాయి. ఈ లుక్‌తో సినిమా అంతా ఉంటే ఆడియన్స్ ఫిదా అయిపోతారని అప్పుడే అనిపించింది. వింటేజ్ మెగాస్టార్‌ను మళ్లీ తెరపై చూపించే అవకాశం రావడం నా కెరీర్‌లో ఒక గొప్ప గిఫ్ట్ అని తెలిపారు. "నేను చిరు, వెంకీ సినిమాలు చూసి పెరిగాను. అలాంటి స్టార్‌లను డైరెక్ట్ చేయడం మాత్రమే కాదుడ వాళ్లతో కలిసి డాన్స్ చేయడం మైండ్ బ్లోయింగ్ ఎక్స్‌పీరియన్స్. బెల్ట్ స్టెప్‌ను పర్ఫెక్ట్‌గా చేయమని చిరంజీవి గారు నన్ను ఎంకరేజ్ చేసిన క్షణం ఎప్పటికీ గుర్తుండిపోతుంది అని గుర్తు చేసుకున్నారు. సినిమాలో చిరంజీవి నటించిన మందు సీన్ సోషల్ మీడియాలో వైరల్ కావడంపై స్పందించిన అనిల్డ చిరంజీవి గారి ప్రతి సినిమాలో ఒక స్పెషల్ సీక్వెన్స్ ఉంటుంది. ఈ సీన్ ఆయన మేనరిజమ్స్‌తో పాటు వెంకటేష్‌తో ఉన్న కనెక్షన్‌ను కూడా చూపిస్తుంది. థియేటర్‌లో ఆ సీన్ అదిరిపోయింది. అయితే ఇది సరదా కోసమేడ పిల్లలు ఇలాంటి వాటికి దూరంగా ఉండాలి" అని స్పష్టం చేశారు.

## మళ్ళీ కలిసిన హిట్ కాంబో.. 'తుడరుమ్' దర్శకుడితో మోహన్‌లాల్ కొత్త చిత్రం



మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ మరియు సెన్సేషనల్ డైరెక్టర్ తరుణ్ మూర్తి కాంబినేషన్‌లో మరో భారీ చిత్రం అధికారికంగా ప్రారంభమైంది. వీరిద్దరి కలయికలో 2025లో వచ్చిన 'తుడరుమ్' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించింది. అయితే ఇప్పుడు మళ్లీ వీరిద్దరూ జత కడుతుండటంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై కేరళతో పాటు సౌత్ ఇండియా అంతటా భారీ అంచనాలు నెలకొన్నాయి. చూ366 అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ ప్రాజెక్ట్ నేడు అధికారికంగా పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఈ విషయాన్ని మోహన్‌లాల్ స్వయంగా సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు. ఈ చిత్రంలో మోహన్‌లాల్ ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నాడు. చాలా కాలం తర్వాత ఆయన పూర్తిస్థాయి ఖాకీ దుస్తుల్లో నటిస్తుండటం సినిమాపై క్యూరియాసిటీని పెంచుతోంది. సీనియర్ నటి మీరా జాస్మిన్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, ఆషిక్ ఉస్మాన్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. రతీష్ రవి కథను అందించిన ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం, షాజీ కుమార్ ఛాయాగ్రహణం సమకూరుస్తున్నారు. ఒకవైపు ఈ చిత్రం ప్రారంభం కాగా, మరోవైపు మోహన్‌లాల్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'దృశ్యం 3' కూడా షూటింగ్ పూర్తి చేసుకుని ఏప్రిల్ 2, 2026న విడుదలకు సిద్ధమవుతుంది.




## అప్పుడు యాత్ర, ఇప్పుడు 'పాదయాత్ర'.. సీనియర్ స్టార్ కొత్త ప్రయోగం

మలయాళం సినీ పరిశ్రమలో తరతరాలుగా తన నటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోన్న సీనియర్ స్టార్ హీరో మమ్ముట్టి ఇప్పటికీ అదే జోరుతో సినిమాలు చేస్తూ వరుస విజయాలు సాధిస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా కథ, పాత్ర బలంగా ఉంటే చాలు అన్నట్టుగా విభిన్నమైన సినిమాలు ఎంచుకుంటూ యువ హీరోలకు గట్టి పోటీ ఇస్తున్నారు. తాజాగా మమ్ముట్టి తన నెక్స్ట్ సినిమాను అధికారికంగా ప్రకటించగా, ఆ సినిమా టైటిల్‌నే ఇప్పుడు పెద్ద చర్చకు దారి తీసింది. మమ్ముట్టి నటించబోయే తాజా సినిమా పేరు 'పాదయాత్ర'. ఈ సినిమాకు మలయాళం సినిమా ప్రపంచంలో లెజెండరీ ఫిల్మ్‌మేకర్‌గా పేరొందిన అదూర్ గోపాలకృష్ణన్ దర్శకత్వం వహించబోతున్నారు మలయాళంలో వాస్తవికత, లోతైన భావోద్వేగాలతో సినిమాలు తెరకెక్కించే దర్శకుడిగా అదూర్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అలాంటి దర్శకుడితో మమ్ముట్టి కలవడం సినీ అభిమానుల్లో భారీ అంచనాలు పెంచుతోంది. ఈ సినిమా టైటిల్ ప్రకటించగానే తెలుగు రాష్ట్రాల్లో కూడా ఆసక్తి ఒక్కసారిగా పెరిగింది. దీనికి కారణం గతంలో మమ్ముట్టి నటించిన 'యాత్ర', 'యాత్ర 2' సినిమాలే. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవితంలోని కీలక ఘట్టం అయిన పాదయాత్రను ఆధారంగా తీసుకొని తెరకెక్కిన 'యాత్ర' సినిమా మంచి విజయం సాధించింది. ముఖ్యంగా మమ్ముట్టి నటనకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు లభించాయి. అయితే అదే సిరీస్‌లో వచ్చిన 'యాత్ర 2' మాత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఇలాంటి నేపథ్యంలో ఇప్పుడు మమ్ముట్టి మరోసారి 'పాదయాత్ర' అనే టైటిల్‌తో సినిమా ప్రకటించడంపై సహజంగానే రాజకీయ కోణంలో చర్చ మొదలైంది. అంతేకాదు, రెండు రోజుల క్రితమే మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి త్వరలో పాదయాత్ర చేస్తానని ప్రకటించడంతో ఈ సినిమా టైటిల్‌కి, రాజకీయ పరిణామాలకు లింక్ పెట్టి సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే సినీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమా పూర్తిగా మలయాళ సినిమా కాగా, దీనికి ఏపీ రాజకీయాలతో లేదా సమకాలీన రాజకీయ పరిణామాలతో ఎలాంటి సంబంధం లేదని తెలుస్తోంది. అదూర్ గోపాలకృష్ణన్ సినిమాలు సాధారణంగా రాజకీయ బయోపిక్‌లకంటే మానవ సంబంధాలు, సామాజిక అంశాలు, వ్యక్తిగత పోరాటాల చుట్టూ తిరుగుతాయి. అందుకే 'పాదయాత్ర' కూడా ఒక వ్యక్తి జీవిత ప్రయాణం, ఆత్మ అన్వేషణ లేదా సమాజంతో అతడి సంబంధాన్ని ప్రతిబింబించే కథగా ఉండే అవకాశముందని ఫిల్మ్ క్రిటిక్స్ అభిప్రాయపడుతున్నారు.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.